DATE: 04-02-2022

prajamantalu, Jagitial

# ప్రజా మంటలు



తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి(Volume) : 2
సంచిక(Issue) : 224

పేజీలు - 10
వెల: రూ 5/-

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

prajamantalu.com

శుక్రవారం

04 ఫిబ్రవరి, 2022

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



కేసీఆర్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
రాజ్యాంగంపై వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను అవమానించడమే

5లో



కరోనా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి
ప్రత్యక్ష బోధనతో పాటు ఆన్‌లైన్ తరగతులకు అనుమతి

5లో

దేశ వ్యాప్తంగా 167.87 కోట్ల

## వ్యాక్సిన్ డోసుల పంపిణీ

గడచిన 24 గంటల్లో 1,72,433 కరోనా కేసులు నమోదు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి3: దేశ వ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి వ్యాప్తి నివారణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేసేకార్యక్రమం చేపట్టింది. ఇప్పటి వరకూ దేశ వ్యాప్తంగా 167.87 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసుల పంపిణీ జరిగినట్టు కేంద్ర ఆరోగ్యశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గడిచిన 24 గంటల్లో 55లక్షల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్టు తెలిపారు. దేశంలో రికవరీ రేట్ 95.14 శాతం కాగా గడిచిన 24 గంటల్లో

- మిగతా 2లో

యధావిధిగా

## గేట్ పరీక్షలు

వాయిదాకు నిరాకరించిన సుప్రీం



2లో



భవిష్యత్తులో ప్రపంచ ధార్మిక కేంద్రంగా

# దివ్యసాకేతం

వెయ్యేండ్లుగా రామానుజ ప్రవచనాలు అనుసరణ

ముచ్చింతల్‌లో సీఎం కేసీఆర్ పర్యటన

విగ్రహ ప్రతిష్ఠాపనలో చినజీయర్‌స్వామి కృషికి ప్రశంస

శోభాయమానంగా సహస్రాబ్ది వేడుకలు

అగ్నిమథనంతో రెండోరోజూ ఉత్సవాలు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి3: హిందూ ధర్మాన్ని అనుసరించే ఆధ్యాత్మిక భక్తులకు, ధార్మికులకు ముచ్చింతల్‌లో సకల వసతులను సమకూర్చడం సంతోషకరమని, ఈ పుణ్యక్షేత్రం భవిష్యత్తులో మరింత సుందర మనోహర దివ్యక్షేత్రంగా అలరారనున్నదని సీఎం కేసీఆర్ చెప్పారు. అనతికాలంలోనే ఈ సమతామూర్తి వేదిక ప్రపంచ ధార్మిక, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విశేష ప్రాచుర్యం పొందుతుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీరామానుజుల కోట్లాది భక్తులకు భారతదేశంలో మరో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లుతుందని చెప్పారు. శ్రీరామానుజుల వారి సమతా స్ఫూర్తిని అందుకొని తెలంగాణ ముందుకు సాగుతుందని తెలిపారు. కులాలకు, మతాలకు అతీతంగా విభిన్న సాంస్కృతిక, సంప్రదాయాలను ఏకతాటిపైన నడిపించే సామాజిక సమతను తాము కొనసాగిస్తామన్నారు. రామానుజ విగ్రహ ప్రతిష్ఠాపనకైన మొత్తం

- మిగతా 2లో



## కేంద్ర బడ్జెట్ రైతులను నిరాశ పరిచింది

రైతులకు జరిగిన అన్యాయంపై ఎన్నికల్లో ప్రచారం చేస్తాం

భారత్ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3: కేంద్ర బడ్జెట్ రైతులను నిరాశ పరిచిందని భారత్ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ అన్నారు. బడ్జెట్‌పై రైతులు చాలా ఆశలు పెట్టుకున్నారని, ఈసారి కేంద్రం ఎంతో మేలు చేస్తుందని ఆశించారని, కానీ అవేం జరగలేదని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న

- మిగతా 2లో

అసదుద్దీన్ కాన్వాయ్‌పై

## దుండుగుల దాడి

తృటిలో తప్పిన ప్రాణాపాయం



లక్నో,ఫిబ్రవరి3: ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ కాన్వాయ్‌పై దుండగులు కాల్పులు జరిపారు. ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికల్లో ఆయన ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో భాగంగా గగురువారం మీరట్ పట్టణంలోని కిథౌర్‌లో జరిగిన ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రచారం ముగించుకుని ఢిల్లీకి తిరిగి వస్తున్న సమయంలో ఛజర్సీ టోల్ ప్లాజా దగ్గర అసద్ వాహనంపై దుండగులు 3-4 రౌండ్ల కాల్పులు

- మిగతా 2లో



రాజ్యాంగంపై కేసీఆర్

## వ్యాఖ్యలు సరికాదు

- దేశప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- దళితులతో పెట్టుకున్న కేసీఆర్‌కు పతనం తప్పదు
- జైభీమ్ దీక్షలో బీజేపీ నేతల డిమాండ్
- కేసీఆర్ తీరుపై మండిపడుతున్న ప్రజలు
- ఆయన క్షమాపణలు చెప్పాల్సిందే
- ఢిల్లీలో జైభీమ్ దీక్షలో బండి సంజయ్ డిమాండ్

హైదరాబాద్,ఫిబ్రవరి3: రాజ్యాంగంపై సీఎం కేసీఆర్ చేసిన చేసిన వ్యాఖ్యలను ఉపసంహ రించుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని మార్చాలని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జైభీం దీక్షలో బిజెపి నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పవిత్ర గ్రంథంగా భావించే రాజ్యాంగం పట్ల కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలపై దేశం ఆశ్చర్యపోయిందన్నారు. బడ్జెట్ పై నిర్వహించిన మీడియా సమావేశంలో రాజ్యాంగం విషయం ఎందుకు వచ్చిందో అర్థంకావడం లేదన్నారు. రెండేళ్లకు పైగా శ్రమించి అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపకల్పన చేశారన్నారు. 60 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని

- మిగతా 2లో

## విభజన హామీలు పట్టించుకోరు



ప్రాజెక్టుకు నిధులు ఇవ్వరు

రాష్ట్రాలపై పెత్తనమే మోడీ లక్ష్యం

జిఎస్టీతో నేత పరిశ్రమను దెబ్బతీసారు

మరోమారు మండిపడ్డ మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి3: రాష్ట్ర విభజన హామీలను పట్టించుకోదు, ఇస్తామన్న ప్రాజెక్టులను ఇవ్వదు? ఒక్క నీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించదు, పైగా రాష్ట్రంపై కేంద్రం రుబాబు చేస్తోందని మంత్రి కెటిఆర్తీవ్ర అసహనాన్ని వెళ్ళగక్కారు. గతంలో ఏ కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రాలపై ఇంత వివక్ష చూపిన దాఖలాలు లేవన్నారు. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వ పాలన అంటే...రాష్ట్రాలపై పెత్తనం సాగించడమే అన్న చందంగా మారిందని దుయ్యబట్టారు. అసలు కేంద్రం దృష్టిలో తెలంగాణ ఏదో పాకిస్తాన్‌లో ఉందన్న భావనతో ఉన్నట్లు కనిపిస్తోందని మంత్రి కెటిఆర్ వ్యాఖ్యానించారు. ఇది ప్రధాన మంత్రి పదవిలో కొనసాగుతున్న వ్యక్తికి ఉండాల్సిన లక్షణం కాదన్నారు. అందుకే కేంద్ర బడ్జెట్‌పై సిఎం కెసిఆర్ తీవ్ర స్థాయిలో ఆక్షేపించారన్నారు. మనకు నష్టం జరుగుతున్న పుడు తిరగబడాల్సిందేనని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తాత్కాలిక నిధులు ఇస్తామనడం తప్ప కేంద్రం ఏమి చేయట్లేదని ఆయన ఆరోపించారు. సిరిసిల్ల విద్యానగర్‌లో సీసీ కెమెరాలను,

- మిగతా 2లో

## ప్రజానాడి




## దళిత బంధు లబ్దిదారులకు 5 కోట్ల విలువ గల వాహనాల పంపిణి



హన్మకొండ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు): హన్మకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో దళితబంధు కార్యక్రమం కింద 4 కోట్ల 81 లక్షల 49 వేల రూపాయల విలువైన వాహనాలను కమలాపూర్ మండలంలోని 51 మంది షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర షెడ్యూలు కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ పంపిణీ చేసారు. అందులో భాగంగా 10 హార్వెస్టర్లు, రెండు ట్రాన్స్ పోర్ట్ వాహనాలు, ఒక ఆటో ట్రాలీ, రెండు బొలోరో వాహనాలు, ఒక జెసిబి, 16 ట్రాక్టర్లు %ం% రోటా వేటర్లు, 2 ట్రాక్టర్లు %ం% ట్రాలీలు లబ్ధిదారులకు పంపిణీ చేయబడ్డాయి. ఈ పంపిణీ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణ రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్, శ్రీధర్ బాబు, జెడ్పి చైర్మన్లు గండ్ర జ్యోతి, సుధీర్ కుమార్, రాష్ట్ర షెడ్యూల కులాల అభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి కమిషనర్ విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్లు రాజీవ్ గాంధీ హన్మంతు, గోపి, శివ లింగయ్య, శశాంక, రూపేష్ మిశ్రా, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్లు అధికారులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్తంగా 167.87 కోట్ల
# వ్యాక్సిన్ డోసుల పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

కొత్తగా 1,72,433 కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 15,33,921 కాగా వీక్లీ పాజిటివిటీ రేట్ 12.98 శాతంగా పేర్కొన్నారు. ఇదిలావుంటే దేశవ్యాప్తంగా కరోనా విజృంభిస్తుండడంతో రోజువారీ కేసులు పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 1,72,433 మంది కరోనాబారిన పడ్డారని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో మొత్తం కేసులు 4,18,03,318కి చేరాయి. ఇక గడచిన 24 గంటల్లో 1008 మంది కరోనాతో మృతి చెందగా.. కేరళ రాష్ట్రం నుంచే 500 మరణాలు నమోదయ్యాయి. దీంతో మొత్తం మరణాల సంఖ్య 4,98,983కి చేరింది. నిన్న ఒక్కరోజే 2,59107 మంది కోవిడ్ నుంచి కోలుకున్నారు. మహమ్మారి ప్రారంభం నుంచి 3.97 కోట్ల మంది కోలుకున్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇక దేశంలో ప్రస్తుతం 15,33,921 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. రోజువారీ కేసులు పెరగడంతో పాజిటివిటీ రేటు 10.99 శాతానికి చేరిందని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటివరకు 167.87 కోట్ల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్లు కేంద్రం తెలిపింది.

### కేంద్ర బడ్జెట్ రైతులను నిరాశ పరిచింది

మొదటిపేజీ తరువాయి..

ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో బడ్జెట్‌లో రైతులకు జరిగిన అన్యాయంపై పాంప్లేట్స్ పంచుతామని, రెండు రాష్ట్రాల్లోనూ ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులను నిలదీయాలని రైతులను కోరుతామని రాకేశ్ తికాయత్ చెప్పారు.
చెరుకు రైతుల నుంచి పంట కొనుగోలు చేశాక కేవలం పద్నాలుగు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తామని సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని, కానీ ఈ చెల్లింపుల విషయంలో ఆలస్యం జరుగు తోందని రాకేశ్ తికాయత్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మాటతప్పారని, ఆయన అబద్దాలు చెప్పారని ఆరోపించారు. 14 రోజుల్లో చెరుకు రైతులకు డబ్బులు చెల్లిస్తామని చెప్పగా.. 11 నెలలు తర్వాత డబ్బులు వచ్చాయని చెప్పారు. యూపీ, హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో అనేక మంది రైతులకు ఇప్పటికీ డబ్బులు రాలేదని, పైగా ఏ ఒక్కరికీ కనీస మద్దతు ధర అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తప్ప ఎప్పుడూ నాయకులు.. రైతుల్ని, ప్రజలను కలిసి సమస్యలు తీసుకోవడం లేదని రాకేశ్ తికాయత్ అన్నారు. ఈ సారి ఓట్లు అడగడానికి వచ్చే నాయకులను రైతులంతా నిలదీయాలని ఆయన కోరారు.'మీ సమస్యలను మీ భాషలోనే నాయకుల దృష్టికి తీసుకెళ్లండని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన అగ్రి చట్టాలకు వ్యతిరేకంగా దాదాపు ఏడాది పైగా పోరాడిన రైతులపై ఈ బ్జడెట్ ద్వారా ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రయత్నం చేశారని స్వరాజ్ ఇండియా అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్ ఆరోపించారు. ప్రభుత్వం అహంకార పూరితంగా వ్యవహరిస్తోందని, అందుకే అలాంటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఆయన మండిపడ్డారు. ఏడేళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నా.. ఆ పార్టీ హామీ ఇచ్చినట్లుగా రైతుల ఆదాయం రెట్టింపు కాలేదని అన్నారు. వ్యవసాయ రంగానికి కేంద్ర బ్జడెట్‌లో పెట్టిన కేటాయింపులు.. కేవలం రైతుల పండించే పంట కొనుగోలుకే సరిపోతాయని, వాస్తవానికి రైతుకు బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారని యోగేంద్ర అన్నారు.

## అసదుద్దీన్ కాన్వాయ్‌పై
# దుండుగుల దాడి

మొదటిపేజీ తరువాయి..

జరిపారు. అసద్ వాహనం టైర్లు పంక్చర్ కావడంతో మరొక వాహనంలో అసదుద్దీన్ ఒవైసీ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. తన కారుపై కాల్పులు జరిపినట్టు సోషల్ మీడియా వేదికగా అసదుద్దీన్ ఒవైసీ వెల్లడించారు.. ఈ ఘటనలో ముగ్గురు లేదా నలుగురు దుండగులు పాల్గొన్నట్టు పేర్కొన్న ఆయన.. తాను ప్రయాణిస్తున్న కారుపై నాలుగు రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలిపారు.. కాల్పుల తర్వాత తుపాకులు ఘటనా స్థలంలోనే వదిలి దుండుగులు పారిపోయినట్టు వెల్లడించారు.. తన కారుకు బుల్లెట్లు తగిలిన ఫొటోను కూడా ఆయన షేర్ చేశారు.. తన కారు పంక్చర్ కావడంతో, మరో కారులో తాను ఢిల్లీకి చేరుకున్నానని.. ఈ ఘటనలో ఎవ్వరికీ ఏమీ కాలేదని.. అందరూ క్షేమంగా ఉన్నారని ట్వీట్ చేశారు..

### బండి సంజయ్ డ్రామాలు మానేయ్

**మాజీ మేయర్ రవీందర్ సింగ్**

కరీంనగర్,ఫిబ్రవరి3: బండి సంజయ్ డ్రామాలు మానేయ్ అంటూ టిఆర్ఎస్ నేత,కరీంనగర్ జిల్లా మాజీ మేయర్ రవీందర్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భీమ్ దీక్ష అని పెట్టి అందులో ముఖ్యనేతలు పేర్లే పెట్టలేదని, రాజ్యాంగంలో ఒక్క ఆర్టికల్ పై మాట్లాడే ధైర్యం చెయ్ అని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్ర అధ్యక్షుడుగా కేంద్రం నుండి ఏమి తెచ్చావు బండి సంజయ్ అని ప్రశ్నించారు.
బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడన్నా ఒక్కటైన సంక్షేమ పథకాలు ఉన్నాయా అని ఆయన అన్నారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ళు ఉన్నాయి ఎవరి బలమెందో చూసుకుందామని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో బండి సంజయ్ గెలవడు.. దళితులకు గౌరవం ఇవ్వవు.. కమిటీలోని ఎంపీలనే పట్టించుకోవు బండి సంజయ్.. దీక్షలు పేరుతో పబ్బం గడుపుతున్నారు బీజేపీ వాళ్ళు అంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. బండి సంజయ్ రచ్చ కోసం చూస్తే మేము చర్చ కోసం చూస్తామని ఆయన అన్నారు.

### అంబేడ్కర్ రాజ్యాంగమే తెలంగాణ ఇచ్చింది

**దానినే అవమానిస్తే ఎలా: ఈటెల రాజేందర్**

కరీంనగర్,ఫిబ్రవరి3: తెలంగాణ సాధించడంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే ఉపయోగ పడిందని బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. హుజురాబాద్‌లో బీజేపీ జై భీమ్ దీక్షలో ఈటెల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత రాజ్యాంగాన్ని అవమాన పరిచేవిధంగా కేసీఆర్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చిన్న రాష్ట్రాలు ఏర్పడడం వల్ల పరిపాలన సులభం అవుతుందని చెప్పిన వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు.
రాష్ట్రపతి ప్రసంగాన్ని గౌరవించాల్సిన టీఆర్ఎస్ బహిష్కరించి అవమానపరిచిందన్నారు. సీఎంగా కేసీఆర్ వచ్చాక ధర్మం, న్యాయం లేకుండా పోయిందన్నారు. లకొడుకు, మనవడు, ముని

## యధావిధిగా
# గేట్ పరీక్షలు

**వాయిదాకు నిరాకరించిన సుప్రీం**



న్యూఢిల్లీ,ఫిబ్రవరి3: దేశ వ్యాప్తంగా ఈ నెల 5వ తేదీ నుంచి జరగాల్సిన 'గేట్' పరీక్షలను వాయిదా వేసేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. నిర్ణీత షెడ్యూల్‌కు 48 గంటల ముందు పరీక్షలను వాయిదా వేయడం గందరగోళానికి, అనిశ్చితికి దారి తీస్తుందని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో పరీక్షల కోసం సిద్ధమైన విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడలేమని జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ విక్రమ్నాథ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కరోనా పరిస్థితుల కారణంగా గేట్‌ను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. పరీక్షను ఎప్పుడు నిర్వహించాలనేది అకాడమిక్ పాలసీకి సంబంధించిన అంశమని, ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని తెలియజేసింది. తొమ్మిది లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉందని, కానీ దాదాపు 20వేల మంది మాత్రమే పరీక్షకు వాయిదా వేయాలంటూ ఆన్‌లైన్ పిటిషన్‌పై సంతకం చేశారని ప్రస్తావించింది. ఇదిలా ఉండగా, పరీక్ష విషయంలో కొవిడ్ పరంగా తగిన మార్గదర్శకాలు విడుదల చేయనందున దీని నిర్వహణపై మధ్యంతర నిలుపుదల ఉత్తర్వులు ఇవ్వాలని బుధవారం సుప్రీం కోర్టులో విద్యార్థుల తరఫున పిటిషన్ దాఖలైన సంగతి తెలిసిందే. అడ్మిట్ కార్డులూ జారీ అయినందున పిటిషన్‌ను లిస్ట్ చేయాలని కోరగా, సర్వోన్నత న్యాయస్థానం అందుకు అంగీకరించింది.

# విభజన హామీలు పట్టించుకోరు



మొదటిపేజీ తరువాయి..

మున్సిపాలిటీ కొనుగోలు చేసిన స్లీపింగ్ యంత్రాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం వైఖరితో తెలంగాణకి తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. నేతన్నలను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరితే స్పందన లేదన్నారు. దున్నపోతు మీద వాన పడ్డట్లుగా కేంద్రం తీరు ఉందన్నారు. ఎనిమిది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా తెలంగాణకు ఏమీ ఇవ్వలేదన్నారు. కేంద్రం జీఎస్టీ వేసి వస్త్ర పరిశ్రమను దెబ్బతీస్తోందని ఆయన ఆరోపించారు. ఒకవైపు పవర్లూం, చేనేత కార్మికులకు దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని మంత్రి కేటీఆర్ అన్నారు. గత ఏడున్నర సంవత్సరాలుగా తమకు అండగా నిలబడమని కోరుతున్నా పట్టించుకోవట్లేదని ఆరోపించారు. సిరిసిల్లకు మెగా పవర్ రూమ్ క్లస్టర్ ఇవ్వండి అడిగినా మొండిచేయి చూపిస్తున్నారని మండిపడ్డారు. పవర్లూం క్లస్టర్ లు, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీ లు అడిగినా ఇవ్వలేదన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న నష్టం కోసం పోరాడితే పోయేది ఏం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని నేతన్నలకు సహాయం చేయాలనే సోయి కేంద్రానికి లేదని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. జిఎస్టీ వేసి నేత పరిశ్రమను దెబ్బతీయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. తాత్కాలికంగా ఐదు రాష్ట్రాలఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేసిందని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్లో రాష్ట్రాని మెండిచేయి చూపిందన్నారు. చేనేత కార్మికులకు మద్దతు గా మాట్లాడిన ఎల్ రమణకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని అర్డర్లు ఇక్కడి చేనేత కార్మికులకే ఇస్తున్నామన్నారు. మరోవైపు ఆదుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నామని తెలిపారు. వ్యవసాయం తరువాత చేనేత రంగంపైనే ఎక్కువ ఆధారపడి ఉన్నారని ఎన్నోసార్లు చెప్పాం.. ఎనిమిదో బడ్జెట్‌లో కూడా ఏమి ఇవ్వలేదు.. మంత్రులను కలిసాం.. మోడీని కలిసినాము..అయినా ఏమి ఇవ్వలేదు.. అందుకే మనకు నష్టం జరుగుతోంది కాబట్టి ఎదురు తిరగబడాల్సిందేనని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## మేడారంను దర్శించుకున్న షర్మిల

**కెసిఆర్ మనసు మార్చాలని మొక్కుకున్నట్లు వెల్లడి**

ములుగు,ఫిబ్రవరి3: మేడారంలో సమ్మక్క సారలమ్మలను వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మనసు మార్చాలని అమ్మలను మొక్కుకున్నానన్నారు. అడవి బిడ్డల మీద ప్రేమ చూపేలా సీఎం కేసీఆర్ మనస్సు మార్చాలని ఆ సమ్మక్క సారాలమ్మ తల్లులను వేడుకున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగుల కోసం నోటిఫికేషన్ ఇచ్చేలా చూడాలని కోరుకున్నానన్నారు. ఆదివాసీల పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తామని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న సాగుదారులకు హక్కులు కల్పించాలని, రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఆత్మహత్యలు ఆపేలా చూడాలని, కేసీఆర్ కళ్ళు తెరిపించాలని కోరుకున్నట్లు ఆమె తెలిపారు.

మొదటిపేజీ తరువాయి..

రూపొందించారని అన్నారు. అసమానతలు కూడిన దేశంలో సమానతలను తీసుకువచ్చేందుకు కృషి చేసిన మహనీయులు అంబేద్కర్ అని అన్నారు. చిన్న రాష్ట్రాలు ఏర్పడడం వల్ల పరిపాలన సులభం అవుతుందని చెప్పిన వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిం దన్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని గౌరవించాల్సిన టీఆర్ఎస్ బహిష్కరించి అవమానపరిచిందన్నారు.
దళిత సోదరులతో పెట్టుకున్న కేసీఆర్ సర్వనాశనం అయిపోతాడని బీజేపీ ఎమ్మెల్యే రాజసింగ్ శపించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చే దమ్ము కేసీఆర్‌కు లేదన్నారు. సీఎం కుర్చీలో కూర్చోపెట్టిన దళితులే కేసీఆర్‌ను కిందకు దించుతారని హెచ్చరించారు. బండి సంజయ్ దెబ్బకు కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చారన్నారు. ప్రగతి భవన్ నుంచి ప్రజలు రోడ్డు మీదకు ఈడ్చుతారని కేసీఆర్‌కు అర్థమైందని అన్నారు. తిట్లు తిట్టడం ఎలా అనే పుస్తకాలను మాత్రమే కేసీఆర్ చదువుతారని యెద్దేవా చేశారు. బడ్జెట్ గురించి కాకుండా బీజేపీని తిట్టడం కోసమే కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టారని రాజాసింగ్ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన 2022 బడ్జెట్‌పై కెసిఆర్ విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా సీఎం కేసీఆర్ రాజ్యాంగంలో మార్పులు రావాలని వ్యాఖ్యానించారు. అయితే సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు. కేసీఆర్ వ్యాఖ్యలపై బీజేపీ మహిళా ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తీవ్రంగా స్పందించారు. అంతేకాకుండా కేసీఆర్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. దళిత సోదరులతో పెట్టుకున్న కేసీఆర్ సర్వనాశనం అయిపోతాడని ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు. ఇది అంబేద్కర్‌ను అవమానించడమే అని అన్నారు. అంతేకాకుండా అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చే దమ్ము కేసీఆర్‌కు లేదని మండిపడ్డారు. సీఎం కుర్చీలో కూర్చోపెట్టిన దళితులే కేసీఆర్‌ను కిందకు దించుతారని ఆయన అన్నారు. దళితులపై కోపంతోనే కేసీఆర్ రాజ్యాంగం మార్చాలంటున్నారని మాజీ ఎంపీ, బీజేపీ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి అన్నారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతికి ఏనాడు సీఎం నివాళులర్పించలేదన్నారు. ఎన్నికల కోసమే దళితబంధు డ్రామాలాడన్నారు. దళితులకు ఇచ్చిన ఏ హామీ నెరవేర్చలేదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా సీఎం మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర బ్జడెట్ లో 25 శాతం కన్నా ఎక్కువ.. ఒక్క మెగా కృష్ణారెడ్డి కాంట్రాక్టర్‌కు కేటాయించారన్నారు. రాష్ట్రంలో కల్వకుంట్ల పాలన కొనసాగుతుందన్నారు. తెలంగాణ సాధించడంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే ఉపయోగపడిందని బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. హుజురాబాద్‌లో బీజేపీ జై భీమ్ దీక్షలో ఈటెల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత రాజ్యాంగాన్ని అవమాన పరిచేవిధంగా కేసీఆర్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎంగా కేసీఆర్ వచ్చాక ధర్మం, న్యాయం లేకుండా పోయిందన్నారు. కొడుకు, మనవడు, ముని మనవడు రాష్ట్రాన్ని పరిపాలించాలని

## రాజ్యాంగంపై కేసీఆర్
# వ్యాఖ్యలు సరికాదు

అనుకుంటున్నారని ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్ తీరుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ భారత రాజ్యాంగాన్ని తిరిగి రాయాలని అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ కూడా కేసీఆర్ తీరును తెలియజేశామని సంజయ్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు దీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగం విషయంలో చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్. ఈ క్రమంలోనే బండి సంజయ్ గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల మాస్కు ధరించి మౌన దీక్ష చేపట్టారు. మౌన దీక్షలో బండి సంజయ్‌తో పాటు ఎంపీ అరవింద్, వెదిరె శ్రీరామ్, పార్లమెంట్ కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యం పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణలోని అన్ని కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు పాలభిషేకం చేయడం జరిగిందన్నారు. కెసిఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారు. కేసీఆర్‌కి ఎందుకు ఇంత అహంకారం? రాజ్యాంగాన్ని తిరిగి రాస్తారా? పంచతీర్థాల పేరుతో అంబేద్కర్ స్ఫూర్తి కేంద్రాలు ఏర్పాటు చేశాం. కల్వకుంట్ల రాజ్యాంగం కావాలా? సచివాలయం వద్దు గడీలు కట్టుకోవాలని అనుకుంటున్నారా..? కేసీఆర్‌కి బుద్ధి ఉందా? కుటుంబ పాలన గురించి ఎవరు ప్రశ్నించొద్దనే విధంగా వ్యవహరిస్తున్నారు. దళిత సమాజాన్ని అణిచివేయాలని చూస్తున్నారు. తెలంగాణ ద్రోహి కేసీఆర్ అంటూ విమర్శలు గుప్పించారు. రాజ్యాంగం పక్కన పెట్టి.. కల్వకుంట్ల రాజ్యాంగం ఉండాలని కెసిఆర్ సంకల్పించారు. తన విగ్రహాలు పెట్టాలని కేసీఆర్ అనుకుంటుండు. బ్రిటిష్, నిజాం పాలన చూశాము. అదే విధంగా మిమ్మల్నీ తరిమి కొడతామని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ ఇటీవల కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన 2022 బడ్జెట్ పై విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా సీఎం కేసీఆర్ రాజ్యాంగంలో మార్పులు రావాలని వ్యాఖ్యానించారు. దీనిని నిరసిస్తూ తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ గురువారం ఢిల్లీలో మౌన దీక్షకు దిగారు.

## భవిష్యత్తులో ప్రపంచ ధార్మిక కేంద్రంగా
# దివ్యసాకేతం



మొదటిపేజీ తరువాయి..

శ్రీఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, అన్నిరకాల ఏర్పాట్లను స్వయంగా జీయర్ స్వామివారే దగ్గరుండి చూసుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ మహాకార్యంలో తమ శక్తివంచన లేకుండా పనిచేస్తున్న చినజీయర్ స్వామి వారి మిషన్‌కు శతసహస్ర వందనాలు తెలియజేస్తున్నానని సీఎం కేసీఆర్ అన్నారు. సహస్రాబ్ది సమారోహం వేడుకలో రెండో రోజు జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు పాల్గొన్నారు. చినజీయర్ స్వామి ఆశ్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ విచ్చేశారు. సమతా క్షేత్రంలో మహోత్కృష్టమైన సహస్రకుండాత్మక శ్రీ లక్ష్మీనారాయణ యాగ మహాక్రతువులో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామనగరాన్ని పరిశీలించారు. 216 అడుగుల శ్రీరామానుజుల విగ్రహాన్ని ఆయన సందర్శించారు. సీఎం కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు రుత్వికులు. సీఎంతో పాటు చినజీయర్ స్వామి, మైహోమ్ అధినేత రామేశ్వరరావు ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నడుచుకుంటూ సెక్యూరిటీ సెంటర్‌కు వెళ్లారు. ఇలాంటి శాంతి సందేశం జాతికి, యావత్ దేశానికి అవసరమని సీఎం కేసీఆర్ అన్నారు. కాగా ఈ కార్యక్రమంలో వైసీపీ ఎమ్మెల్యే రోజా, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలు కూడా పాల్గొన్నారు. ముచ్చింతల్‌లో సమతామూర్తి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ హాజరు కానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. సమీక్ష లో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,పోలీసు ఉన్నత అధికారులు పాల్గొన్నారు. సమతామూర్తి విగ్రహ ప్రాంగణానికి ముందు పార్కింగ్ ఏరియాకు ఎదురుగా ఉన్న భవనంలో ఏర్పాటు చేసిన పోలీసుల కమాండ్ కంట్రోల్ రూంను సీఎం పరిశీలించారు. సమతామూర్తి శ్రీరామనుజాచార్యుల సహస్రాబ్ది వేడుకలు హైదరాబాద్ శివారు ముచ్చింతల్‌లోని శ్రీరామనగరంలో వైభవంగా జరుగుతున్నాయి. 12 రోజుల ఈ మహాక్రతువులో తొలిరోజు ఆరాధన శోభాయమానంగా జరిగింది. రెండో రోజు ఉత్సవాలు కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. శ్రీ రామానుజ సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా అగ్నిమథనం పూర్తి అయింది. రెండో రోజు శ్రీ లక్ష్మి నారాయణ మహాక్రతువులో భాగంగా శమి, రావి కర్రలతో అగ్ని మథనం చేశారు. మంత్ర పూర్వకంగా శమి, రావి కర్రలను పెరుగు చిలికినట్లు చిలుకుతూ వచ్చిన అగ్నిని కుండలాల్లో పోసి హోమాన్ని నిర్వహిస్తున్నారు. భక్తులు భగవన్నామస్మరణ చేస్తుంటే రెండు కర్రల రాపిడికి పట్టిన అగ్నిని 1035 కుండలాల్లో పోశారు. ఏకకాలంలో 5 వేల మంది రుత్వికులతో 1035 కుండలాల్లో హోమాలు నిర్వహిస్తున్నారు. ప్రవచన శాలలో వేద పండితుల ప్రవచన పారాయణం జరుగుతోంది. గురువారం శ్రీరామానుజ సహస్రాబ్ది ఉత్సవాలకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు హాజరయ్యారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. కరోనా నిబంధనలు అమలవుతున్నాయో లేదో చూశారు. మరోవైపు.. ఎల్లుండి ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులతో పాటు డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. యాగశాలలో అగ్నిహోత్రం ఆవిష్కరణ, 1035 కుండలాలలో హోమం జరుగుతుంది. ఈ హోమాన్ని ఐదు వేల మంది రుత్వికులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి జీయర్ స్వాములు, రుత్వికులు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సహస్రాబ్ది వేడుకలు 12 రోజులపాటు సాగనున్నాయి. ఈ వేడుకలకు 7 వేల మంది పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశారు. 45 ఎకరాల విస్తీర్ణంలో రూ.12 వేల కోట్లతో సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం నిర్మాణం చేశారు.



## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** జగిత్యాల రూరల్ మండల పొలాస కు చెందిన టిఆర్ఎస్ నాయకులు, పొలేస్తేశ్వర ఆలయ చైర్మన్ వీర్ల శంకర్ బుధవారం హత్యకు గురికాగా పొలాస లో శంకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. అనంతరం మాట్లాడుతూ.... టిఆర్ఎస్ పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందని, చిన్న చిన్న తగాదాలకు హత్యలు చేసుకోవటం భాధాకరమని, శాంతియుతంగా పరిష్కరించుకోవాలని అన్నారు.




జగిత్యాల జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో "గంజాయి వద్దు ఆరోగ్యం ముద్దు" అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్




జగిత్యాల పట్టణ పావని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 17 మంది నిరుపేదలకు 'ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు' చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అనంతరం వారికి ఉచిత కళ్ళ అద్దాలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోరే గంగమల్లు తదితరులు ఉన్నారు.

## మటన్, కూరగాయల మార్కెట్ (బీట్)లో ఏర్పాటుకై ఎమ్మెల్యేకు వినతి

జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు): మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జగిత్యాల సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ని కలిసి జగిత్యాల పట్టణంలో వ్యవసాయ మార్కెట్ (బీట్) లో కూరగాయల,



మటన్, చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయటం ద్వారా చుట్టూ గ్రామ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని, పార్కింగ్ సదుపాయం ఉండి ప్రజలకు ఇబ్బంది లేకుండా హోల్ సేల్, రిటైల్ మార్కెట్ లకు అనుకూలంగా ఉంటుందని సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి, అధ్యక్షులు గుమ్ముల అంజయ్య, రైతు నాయకులు జుంబర్తి శంకర్, పల్లికొండ రాజు, బింగి గంగారాం, రాజయ్య, శంకరయ్య, బింగి రాజం, గుమ్ముల రాజేష్, తదితరులు ఉన్నారు.

## పుస్తె మట్టెలు అందించిన తిరుపతి రెడ్డి

**బచ్చన్నపేట ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** మండల కేంద్రంలోని ఇటుకలపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబం జెరిపోతుల సిద్దయ్య కీ.శే. నీలమ్మ కూతురు శ్రీమతి వివాహానికి సామాజిక సేవకర్త బిజెపి నాయకులు ముక్కెర తిరుపతి రెడ్డి తన వంతు సహాయంగా పుస్తె మట్టెలు అందించి పేద కుటుంబానికి అండగా



నిలిచారు. ఈ వేడుకలో బొడిగం చంద్రా రెడ్డీ, బైరగొని కనకయ్య గౌడ్, నాగమల్ల స్వామి, మదెల్పటి రమేష్, వెంకటేష్, జేరిపోతుల అంజయ్య, జేరిపోతుల నర్సయ్య, పర్శరాములు, బాలయ్య, చంద్రయ్య, శిద్దయ, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




విద్యావేత్త సేవా తత్పరలు లయన్ కాసం అంజయ్య జన్మదినం పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. జిల్లా సహాయ కో ఆర్డినేటర్ కుందూరు వెంకట్ రెడ్డి సూచనలతో స్థానిక నెహ్రూ పార్క్ వద్ద 500 మందికి అన్నదానం

# కేసీఆర్ వాఖ్యలపై బీజేపీ నాయకుల చిల్లర రాజకీయాలు

### చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్

**కరీంనగర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** కరీంనగర్ పట్టణంలో మంత్రి గంగుల మీసేవ కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ మాట్లాడుతూ.... బీజేపీ నాయకులు కేసిఆర్ వాఖ్యలపై మాట్లాడే ముందు బీజేపీ పాలిత




రాష్ట్రాల్లో పేద,బడుగు బలహీన వర్గాల కోసం ఒక్క సంక్షేమ పథకం ప్రవేశ పెట్టిందా? కాంగ్రెస్ ప్రభుత్వ మైన సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టింది అన్నారు.ఆయన మాట్లాడుతూబీజేపీ అధికారంలో ఉన్న చోట్ల దళిత మహిళల పై అత్యాచారాలు చేసి చంపిన ఘటనలున్నాయి.బడ్జెట్ లో రైతుల కోసం ఒక్క పథకం ప్రవేశ పెట్టలేదు.బీజేపీ వాళ్ళు పచ్చి అబద్దాలు ఆడుతున్నారు.ఏ ఒక్క రంగానికైనా ప్రయోజనం చేకూర్చే విదంగా బడ్జెట్ ఉందా అని ఆలోచన చేయండి.కేసీఆర్ కిట్ లో ఒక్క రూపాయి ఉండదు.బండి సంజయ్ కాళేశ్వరం ప్రాజెక్టు జాతీయ హోదా కోసం అడగడం లేదు. అరవింద్ పసుపు బోర్డ్ తీసుకు వచ్చాడా?. మీద నిలబడక పోతే రాజీనామా చేయాలి. భీమ్ దీక్ష లో దళిత ఎంపీ బాబు రావు ఫోటో లేదు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలోకి ఉన్నపుడు చాలా సార్లు రాజ్యాంగాన్ని మార్చారు. సీఎం రాజ్యాంగం కించ పరిచే విదంగా ఎక్కడ మాట్లాడలేదు. దళిత బంధు 119 నియోజకవర్గంలో అమలు చేస్తున్నారు సీఎం కేసీఆర్. దళితుల కోసం ఒక్క పథకమైన తీసుకువచ్చారో బీజేపీ నాయకులు చెప్పాలి.

దేశంలో దళితబంధు అమలు చేసే దమ్ము ఉందా? అంబెడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయడంలో మేము చిత్తశుద్ధితో ఉన్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మరియు తెరాస నాయకులు పాల్గొన్నారు.

# సి.ఎం. వ్యాఖ్యలకు బిజెపి నిరసన

**జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** రాజ్యాంగాన్ని మార్చాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన తీవ్ర వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి రాష్ట్ర శాఖ పిలుపుమేరకు, జగిత్యాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్ కుమార్ మాట్లాడుతూ....



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత సాయంత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రెస్ మీట్ పెట్టి రాజ్యాంగాన్ని మార్చాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం లోని ఆర్టికల్ 3 ద్వారానే ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక తెలంగాణను ఏర్పాటు చేయగలిగామని, రాజ్యాంగం ద్వారానే కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యి ఇప్పుడు అదే రాజ్యాంగాన్ని మార్చాలి అనడం, అంబేద్కర్‌ను, దళితులను అవమానపరచడమేనని, అంతే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన ప్రధాని మోడీని పరుష పదజాలంతో దూషించడం ముఖ్య మంత్రి స్థాయికి తగదని, రాజ్యాంగాన్ని లిఖించిన అంబేద్కర్ రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చడానికి వీలు కాదని, సవరణలు మాత్రమే అవకాశం ఉందని పేర్కొన్న విషయం గమనించాలని పేర్కొన్నారు. ఇట్టి వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా క్షమాపణ చెప్పే వరకు భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేపడుతుందని పేర్కొన్నారు .ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు లింగంపేట రాజన్న, ఆముద రాజు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు అలగుర్తి లక్ష్మీనారాయణ స్వామి, జిల్లా సీనియర్ నాయకులు చిలకమర్రి మదన్మోహన్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కొక్కు గంగాధర్, జిల్లా అధికార ప్రతినిధి భూమి రమణ, సీనియర్ నాయకులు సిపెల్లి రవీందర్, లింగంపేట్ శ్రీనివాస్, అంకారి సుధాకర్, కిషోర్ సింగ్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చింత అనిల్ ,జిల్లా కార్యాలయ కార్యదర్శి నలువాల అశోక్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు జుంబార్తి దివాకర్, పట్టణ ఉపాధ్యక్షులు నల్ల నారాయణ రెడ్డి, పవన్ సింగ్, మాడిశెట్టి మల్లేశం బైరి రాజేందర్, పట్టణ కోశాధికారి కోసిగి సత్తయ్య, దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు నక్క జీవన్, యువమోర్చా పట్టణాధ్యక్షుడు కొండ్ర రవి తేజ, యువ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి చుక్కల ప్రేంసాగర్, యువ మోర్చా ఉపాధ్యక్షుడు పిస్క నరేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాపర్తి రాజు, నాయకులు బరిగెల భూమన్న, గట్ల శ్రీనివాస్, జుంజుర్ గంగారాం, కాసారపు శ్రీనివాస్, హరి కిరణ్, చంద్రశేఖర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో రాజ్యాంగాన్నిమార్చడం కాదు,

### రాష్ట్రంలో అహంకార కేసీఆర్ ప్రభుత్వాన్ని మార్చాలి

**కరీంనగర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు మతిభ్రమించి రాజ్యాంగాన్ని మార్చాలంటున్నారని, దేశంలో రాజ్యాంగాన్ని కాదు, రాష్ట్రంలో అహంకార కేసీఆర్ ప్రభుత్వాన్ని మార్చాలని, ముఖ్యమంత్రి పదవి కెసిఆర్ కు రాజ్యాంగం పెట్టిన భిక్షనని,



రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చాలని కెసిఆర్ కోరడం ఆయన నిజ స్వరూపానికి నిదర్శనమని బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణ రెడ్డి దుయ్యబట్టారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భారత రాజ్యాంగాన్ని మార్చాలని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భీమ్ దీక్ష కార్యక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రి కెసిఆర్ బేషరతుగా ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వేణు, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు మర్రి సతీష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ్ చంద్ర, సంకిడి శ్రీనివాసరెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ కటకం లోకేష్, జిల్లా కార్యాలయ కార్యదర్శి మాడుగుల ప్రవీణ్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు గాయత్రి, కరీంనగర్ జోనల్ అధ్యక్షులు అనూప్, ఆవుదుర్తి శ్రీనివాస్, పాదం శివరాజ్, తూర్పాటి రాజు, పిట్టల మధు, ప్రసన్న, పుప్పాల రఘు, ఎలుక అభి, మామిడి చైతన్య పాల్గొన్నారు.

### గల్ఫ్‌లో ఇబ్బంది పడుతున్న వారికై సాయం

# సోషల్ వర్కర్, షేక్ చాంద్ పాషా

**జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** ఉపాధి నిమిత్తం కొరకు సౌదీ అరేబియాకు గత 14 సంవత్సరాల క్రితం వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతూ ఇండియాకు రాలేక, అక్కడ బ్రతకలేక నరక యాతన పడుతున్న సామాన్యుల కథ ఇలా ఉంది. పెగడపల్లి మండలం రాములపల్లె గ్రామానికి చెందిన ఒరుకుళ్ళ కొమురయ్య 14 ఏళ్ల కింద ఆజాద్ వీజా పైన వెళ్ళాడు. అక్కడ పని చేసుకుంటూ గౌరయ్య మొదటి నుంచి కష్టాల్లో ఉన్నాడు. కొమురయ్య ఇద్దరు కుమారులు భార్య తల్లి, తండ్రి, చెల్లె 14 సంవత్సరాలు ఎదురు చూస్తున్న కొమురయ్య భార్య చివరికి మానసికంగా కుంగి పోయింది. ఉపాధి కోల్పోయి,



కాలుకు గాయాలై నరకయాతన పడుతున్న గౌరయ్య ఇటీవలి కాలంలో సోషల్ వర్కర్ చాంద్ పాష కు ఫోన్ చేసి తన బాధను మొరపెట్టుకున్నాడు. ఆంధ్రకు చెందిన ఓ వ్యక్తి సౌదీ అరేబియాలో మరో వ్యక్తితో తాను పని చేసుకుంటూ తాపీ మేస్త్రి కొంత మంది యువకులు పని మీద పెట్టి బిల్డింగ్ పని చేయిస్తూ ఉండేవాడు. రావాల్సిన డబ్బులు బిల్డింగ్ యాజమాని నుండి ఆంధ్ర వ్యక్తి స్థానిక వ్యక్తి డబ్బులు కూడా డబ్బులు పెట్టి తను పోయాడు. ఇట్టి విషయాన్ని గమనించిన కొమురయ్య డబ్బులు ఇవ్వాలని అతనిని నిలదీస్తే అతడు 35,000 అప్పు ఉన్నావని సదరు అరబ్బీ వ్యక్తి కొమురయ్య పైనే అక్రమ కేసు పెట్టారు. ఆ కేసును ఎదుర్కోలేక ఇండియాకు రాలేక నరకయాతన పడుతున్న కొమురయ్య పరిస్థితి దీనంగా ఉంది. ఈరోజు కొమురయ్య మరో ఓ వ్యక్తి మహేందర్ చందుర్తి మండలం కాశిరెడ్డి పల్లె గ్రామం పది సంవత్సరాలుగా పనిచేయిస్తూ, స్థానిక రవి పని చేయించి, డబ్బులు ఇవ్వకపోగా తన పాస్పోర్టు తన వద్ద పెట్టుకోవడం వల్ల ఎవరికి చెప్పుకోవాలో తెలవక ఇండియా రాలేక నరక యాతన పడుతున్నాడు. గత రెండు సంవత్సరాల క్రితం భారత రాయబార కార్యాలయం వెళ్లి అర్జీ పెట్టుకున్న అధికారులు అవుట్ పాస్ పోర్ట్ చేతులు దులుపుకున్నారు. దాంతోపాటు కరోనా వ్యాధి వల్ల ఫ్లైట్ లేకపోవడం వల్ల మహేందర్ రాలేకపోయాడు. రెండు సార్లు పాస్పోర్ట్ ఉన్న డబ్బుల్లేక రాలేకపోతున్న వారు ఇంకా ఎందరో ఉన్నట్టుగా వారు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈరోజు ఇండియన్ ఎంబసీ అధికారులకు భారత రాయబార కార్యాలయం కు లేఖ రాసి, అనంతరం హైదరాబాద్ ఎన్నారై సెల్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుంది. గతంలో ఎవరికైనా ఇబ్బంది ఉంటే ఎన్నారై సెల్ ద్వారా బాధిత కుటుంబాలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందించి అధికార యంత్రాంగం అప్రమత్తమై వారిని కాపాడి తీసుకొచ్చేవారు కానీ తెలంగాణ రాష్ట్రంలో ఆపకే తినడం లేదు ఎన్నారై సెల్ పూర్తిగా విఫలమైంది. ఎన్నారై సెల్ లో అధికార యంత్రాంగం పని చేయకపోగా అసలు పట్టించుకునే నాథుడే లేకపోయాడు. స్పందించిన ఎన్ఆర్ఐ అధికారులు తక్షణమే కొమురయ్య, మహేందర్ లతోపాటు ఎంతమంది అక్కడ ఉన్న వారందరినీ తీసుకురావాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కాబట్టి వెంటనే ఇలాంటి వారిని గుర్తించి అందర్నీ తీసుకురావాలని సోషల్ వర్కర్, షేక్ చాంద్ పాషా జగిత్యాల 9949321330 కోరుతున్నారు.



## వైయస్సార్ తెలంగాణ పార్టీ కార్యాలయం ప్రారంభం

**జనగామ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** వైయస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా కార్యాలయాన్ని జనగామలో గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా పలు వురు మాట్లాడుతూ.... వైయస్సార్ ఆశయ సాధనకై వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108 ,104 విద్యార్థులకు ఉచిత విద్య, మిషన్ భగీరథ లాంటి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించడానికి వైయస్ షర్మిల నాయకత్వంలో పార్టీ నిర్మాణం చేయబడిందని అన్నారు. అన్నివర్గాల వారు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇందుర్తి వెంకట్ రెడ్డి, వెంకటరత్నం, రమేష్, గుగ్గిళ్ళ శ్రీధర్, శ్రీ శ్రీకాంత్, చేవెళ్ల స్వామి, ప్రవీణ్, నరేష్, రిత్విక్, పర్వీన్ పాల్గొన్నారు.

## కేసీఆర్ వ్యాఖ్యలకు నిరసన

**ధర్మపురి ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జ్ లు ధరించి నిరసన తెలిపి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి,పూలమాల వేశారు. మండలాధ్యక్షులు సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, కేసీఆర్ ముఖ్య మంత్రి పదవి భారత రాజ్యాంగాన్ని అనుసరించే జరిగిందని రాజ్యాంగాన్ని



అవమానించిన మీకు ఈ రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్,సీపతి సత్యనారాయణ, రఫియోద్దీన్, మహేందర్, జాజల రమేష్, గరిగె రమేష్, మల్లేష్, బొల్లారపు పోచయ్య, అశెట్టి శ్రీను, శ్రావణ్, వడ్ల రమేష్, ప్రేమిత్, నవీన్, గంగారాం పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వంలోనే కళలకు పెద్దపీట

### ఎమ్మెల్సీ ఎల్. రమణ

**జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రభుత్వం లో కళలకు, కళాకారులకు, సాహిత్యాన్నికి పెద్ద పీట వేసిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు అని ఎమ్మెల్సీ ఎల్. రమణ కొనియాడారు. ఎమ్మెల్సీగా ప్రమాణం స్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా జగిత్యాల కు విచ్చేసిన ఎల్. రమణ ను జగిత్యాల కు చెందిన కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్ అధినేత గుండేటి రాజు తలపాగా, శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో కళా



కారులకు, కళా సంస్థలకు ప్రోత్సాహం అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, జిల్లా కుర్మా సంఘము అధ్యక్షుడు వొళ్ళం మల్లేశం, దయాల మల్లారెడ్డి, బుర్ర శ్రీధర్ గౌడ్, తదితరులు హాజరయ్యారు.

## యువతకు క్రీడా సామగ్రి అందించిన పారిశ్రామికవేత్త

**వేలేరు ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** మండలంలోని షోడశపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ గడ్డి సాయిలు ద్వితీయ కుమారుడు ప్రముఖ పారిశ్రామికవేత్త గడ్డి రవి యాదవ్ - రేఖ దంపతులు షోడశపల్లి గ్రామంలో నవయుగ యూత్ కి 30,000 రూ. లతో వాలిబాల్ ఆటకు నెట్స్, వాలిబాల్స్, (50) యాబై ఎస్-ఎస్ఈ టీ షర్ట్స్, షాట్స్ 4వ, వార్డ్ మెంబర్ బుట్టి శ్రీను ఆధ్వర్యంలో



అందజేశారు. అనంతరం రవి యాదవ్ మాట్లాడుతూ ఆటలు పాటలు, నృత్యాలు చదువులో పిల్లలందరూ అన్నింటిలో ముందుండాలనే ఉద్దేశ్యంతో సమకూర్చినట్లు తెలిపారు. చదువు పట్ల నిర్లక్ష్యం ఉండకూదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో షోడశపల్లి సర్పంచ్ కొట్టె రాజేష్, తెరాస అధ్యక్షుడు కొయ్యడ శ్రీను, కొయ్యడ నగేష్, పిల్లల్ని ప్రోత్సహిస్తున్న ఫేంటర్ కొట్టే రాజేష్, వాలి బాల్ కోచ్ ధార వెంకటేష్, నవయుగ యూత్ అధ్యక్షుడు గొర్రె వెంకటేష్, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రమేష్ బాబు జన్మదిన వేడుకలు

**కథలాపూర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో టీఆరెఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల నాయకుల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను రాష్ట్ర సహాయ కార్యదర్శి లోక బాపు రెడ్డి కట్ చేశారు. అంతకు ముందు స్థానిక ఆలయంలో ఎమ్మెల్యే రమేష్ బాబు పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దుంపెట గ్రామంలో కో ఆప్షన్ రఫీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. టీఆరెఎస్ నాయకులు మాట్లాడుతూ.... ఎమ్మెల్యే రమేష్ బాబు వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. జడ్పీటీసీ నాగం భూమయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ వర్ధినేని నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కిరణ్ రావు, కో ఆప్షన్ రఫీ, మండల అధ్యక్షులు గడిలా గంగా ప్రసాద్, రుద్రంగి జడ్పీటీసీ గట్ల మీనయ్య, రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూప మహేష్, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అన్ని గ్రామాల టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా మంటలు

# రాజ్యాంగంపై విస్తృతంగా చర్చించాలి !

భారత రాజ్యాంగం ఈ దేశ ప్రజలందరినీ సమస్కంధులుగా, సమాన వాటాదారులుగా ప్రకటించింది. అయినప్పటికీ ఇంకా ఇన్ని కోట్లమంది ప్రజలు నిస్సహాయులుగా నిరుపేదలుగా మిగిలి పోవడానికి కారణం ఏమిటి? ఇది రాజ్యాంగం లోపమా.. లేక నాయకుల లోపమా అన్నది చర్చించాలి. భారత రాజ్యాంగాన్ని మార్చాలన్న ప్రతిపాదనలపై కొన్ని రాజకీయా పార్టీల నేతలు ఎగిరిపడడం చూస్తుంటే వారు ఎంతగా పదవు లను పట్టుకుని పాతుకుని పోవాలన్న ధోరణిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగ ఇంతకాలం కేవలం రాజకీయనాయకుల అవసరాలను మాత్రమే తీర్చింది. పెత్తందారీలకుమాత్రమే మేలు చేసింది. బడాబాబు లను మరింత పెద్దవారుగా ఎదగడానికి దోహదపడింది. సామాన్యులు సామాన్యులగానే ఉండి పోయారు. విద్య,ఉద్యోగం,వైద్యం వంటి వాటిల్లో ఖచ్చితమైన హామీని పొందలేకపోయారు. ఇవన్నీ చర్చించాల్సిన సమయం ఇప్పుడు వచ్చింది.రాజ్యంగంలో ఉన్న అంశాలను చర్చించాలి.ఎక్కడ మనం విఫలం అయ్యుమో చర్చించాలి.కారకులు ఎవరో తేల్చాలి. రాజ్యాంగం అంటూ మార్చాల్సి వస్తే రాజకీయ నాయకుల పెత్తనం లేకుండా ఉండేలా చూసుకోవాలి. రాజ్యాంగం అంటే శిలాశాసనంగా ఉండాలి. దానిని కాదని పక్కకు తొలగి తే ఉరివేసే విధంగా శిక్షలు ఉండాలి. భయం ఉంటే తప్ప ప్రజలకు న్యాయం జరగదు. నిజానికి రాజ్యాంగా న్ని మార్చాల్సిన అవసరంపై చర్చచేయాలి. రాజకీయ నాయకుల అభీష్టం మేరకు కాకుండా ప్రజల ఆలోచ నలకు అనుగుణంగా, సమాజాంలో అసవరాలకు అనుగుణంగా..మారిన ప్రపంచ గతికి అనుగుణంగా మన రాజ్యాంగాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఒకే వ్యక్తి జీవిత పర్యంతం పదవులను పట్టుకుని వేలాడే పద్ధతి పోవాలి. రిజర్వేషన్లు ఒకే కుటుంబంలో జీవితాంతం అనుభవించే దశ పోవాలి. 130 కోట్ల మందికి అనుగుణంగా రాజ్యాంగం మారాలి. అంతరికీ సమాన ఫలాలు దక్కేలా చట్టాలు ఉండాలి. రిజర్వేషన్ల ఫలాలు అన్ని కుటుంబాలకు వరుసగా అందాలంటే ఒక్కో కుటుంబానికి గరిష్టంగా రెండు పర్యాయాలు మాత్రమే దక్కాలి. రాజకీయంగా కూడా రిజర్వేషన్లు రావాలి. సర్పంచ్ మొదలు ఎంపిలు, ఎమ్మెల్యేల వరకు ఒక వ్యక్తి రెండు పర్యాయాలకు మించి పదవిలో ఉండకుండా.. అమెరికా అధ్యక్ష పాలన తరహాలో రిజర్వేషన్లు ఉండాలి. అప్పుడు ప్రజలకు మరిన్ని అవకాశాలు వస్తాయి. కెసిఆర్ చెప్పినట్లో లేదా మోడీ చెప్పినట్లో రాజ్యాంగం కాకుండా మేధావుల సమక్షంలో ప్రజల అభీష్టం మేరకు మార్పులు,చేర్పులు జరగాలి. ప్రస్తు రాజ్యాంగం మూలాలను విడవ కుండా ఇందుకు సిద్ధపడాలి. అలా చేయడం ద్వారా ప్రజలకు రాజ్యాంగ రక్షణ దక్కగలదు. నిరంతరాయం గా రాజకీయ నేతలు పదవులు పట్టుకుని వేలాడడం వల్లనే రాజ్యాంగం అపహాస్యం అవుతోంది. పేదలకు రక్షణ కల్పించలేకపోతున్నది. రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా పాలన చేస్తున్నారు. తాము చెప్పిందే రాజ్యాంగం అన్నరీతిలో సాగుతున్నారు. అందరికీ సమాన స్థాయిలో నాణ్యమైన విద్య,వైద్యం, ఉద్యోగగ,ఉపాధి అవకాశాలను అందివ్వలేకపోవడం వల్ల రాజ్యాంగం అపహాస్యం అవుతోంది. ఇది రాజకీయ నాయకుల కురుచ బుద్ధి వల్ల, స్వార్థం వల్ల, అధికార యావ వల్ల అని తేలింది.అందుకు కారణం రాజకీయాలే అని విద్యావేత్తలు, ఆర్థిక నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు ఇప్పుడు బల్లగుద్ది మరీ చెబుతున్నారు. పేదరికంపై విజయం సాధించ గలిగే చర్యలు జరగడంలేదు. నిర్ణయాలు ఉండడం లేదు. ప్రజలందరికీ నాణ్యమైన విద్యను అందించలేని జాతీయ విద్యావిధానం అవసరమా అన్నది చర్చించాలి. ఉద్యోగాలు కల్పించలేని చదువులు అవసరమా అన్నది చర్చించాలి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన




దగ్గర్నుంచీ లెక్కలేసుకుంటే ప్రజలకన్నా వ్యాపారు లు, కార్పోరేట్లు, రాజకీయ నేతలే బాగుపడ్డారు. వారికోసం ప్రజల జీవితాలను పణంగా పెడుతూ వస్తున్నారు. ఓట్లను కొల్లగొట్టి అధికారం చెలాయిస్తున్నారు. నీతి వాక్యాలు ప్రవచిస్తున్న రాజకీయ నాయకులు అంతా ఇందుకు అతీతం కాదు. మొన్నటి కరోనా కారణంగా వేలాదిమంది మృత్యువాత పడ్డారు. దీనికి సంబంధిం చిన లెక్కలు కూడా సరిగా చెప్పలేని పాలకులు మనకు అసవరమా.... వారిని ఆదుకోలేని పాలకులు మనకు అసవరమా..అన్నది ఆలోచన చేయాలి. రాజ్యాంగం పటిష్టంగా ఉండి..రాజకీయ నాయకుల పెత్తనం లేకుంటే ఇలా జరిగేదా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. పాలకులు అంటే పన్నులు వేయడం..తాము అనుకున్న పనులు చేసుకోవడం...దర్జాగా ఎసి గదుల్లో సుఖాలు అనుభవించడం.. ప్రత్యేక విమానాల్లో విహారాలు చేయడం వంటివన్నీ ప్రజల జీవితాలను పణంగా పెట్టి చేయాల్సిన ఆగత్యం ఉందా అన్నది ఆలోచనచేయాలి. గత రెండేళ్లుగా పార్లమెంట్ సమావేశాలు సరిగా సాగడం లేదు. కరోనా దెబ్బకు సమావే శాలు కుంచించుకుపోగా, దాదాపు ప్రతి సమావేశంలో ప్రతిపక్షాలు గందరగోళం సృష్టిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చూస్తున్నాం. పార్లమెంట్ సాగకపోవడం అన్నది ఎందుకన్న ఆలోచన చేసేదెవరు. నిజానికి ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు ప్రభుత్వం జవాబు చెబుతూనే పార్లమెంట్‌ను సజావుగా నడిపిం చే అవకాశాలున్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం,మద్దతు ధరలు,రైతుల సమస్యలు, కరోనా సమస్యల గురించి చర్చ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. మన రాజ్యాంగం పటిష్టంగా ఉన్నా వీటిపై చర్చ జరగక పోవడానికి గల కారాణాలు ఏమిటన్నది ముందు చర్చించాలి. అంటే రాజకీయపెత్తనమే దీనికి కారణమని అర్థం అవుతోంది. ఇలా జరగడం అసవరమా అన్నది ముందుగా ఆలోచనచేయాలి. ఈ క్రమంలో రాజ్యాంగాన్ని మార్చాలన్న విషయంలో చర్చ చేయాలి. అది ప్రజలకు ఎలా ఉపయోగ పడగలదో ప్రజాభిప్రాయం తీసుకోవాలి. బీజేపీ ఆలోచననే సీఎం కేసీఆర్ ప్రతిపాదించారని కాంగ్రెస్ నేతలు భుజాలు తుడుముకోవాల్సిన అసవరం లేదు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ ఎన్నో ఏళ్లుగా కుట్ర చేస్తోందని, ఆ కుట్రకు కేసీఆర్ వంత పాడారన్న ఆరోపణలు సరికాదు. రాజ్యాంగాన్ని మార్చాల్సి వస్తే వారి ప్రమేయమే కాదు..కాంగ్రెస్ ప్రమేయం కూడా లేకుండా సాగాలి. భూస్వాములు, అగ్రవర్ణాల కోసం రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్నారన్న వారు..ప్రజలకు లేదా సామాన్యులకు తమపాలనా కాలంలో ఎలా న్యాయం చేశారో చెప్పాలి. దేశ ప్రజలకు ఏమాత్రం మేలు జరగక పోవడానికి ఎవరు కారణమో చర్చించాలి. భారత రాజ్యాంగాన్ని మార్చాలని కేసీఆర్ అనడం సరైందా కాదా అన్నది ముఖ్యం కాదు. అసలు ప్రజలకు ఎందుకు న్యాయం జరగడం లేదో.. ఎస్సీ, ఎస్టీల జీవితాలుఎందుకు బాగుపడడం లేదో చర్చించాలి. విద్యా,వైద్యంలో ఎందుకు ముందుకు వెళ్లలేదో చర్చించాలి. నేటికి మంచినీటి కటకటలు ఇంకా ఎందుకో చర్చించాలి. ఉన్న వనరులను వాడుకుని వాటిని ప్రజలకు ఎందుకు చేరవేయడం లేదో చర్చించాలి. అప్పుడు రాజ్యాంగం మార్చాలా వద్దా.. అన్నది తేలగలదు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

# జీర్ణాశయం కష్టాలు

టిఫిన్ తిందువు గానీ త్వరగా రా ఆకాష్! అంటూ అమ్మ వంటింట్లోంచి కేక పెట్టింది. యూనిఫాం వేసుకొని టై కట్టుకుంటూ ఆకాష్ డైనింగ్ టేబుల్ దగ్గర కొచ్చి చూశాడు. ప్లేట్లో ఇడ్లి చూడగానే చిరాకు వచ్చింది. "అమ్మా నాకు నూడుల్స్ కావాలి. ఈ ఇడ్లి వద్దని ఎన్నిసార్లు చెప్పాను" విసుగ్గా అరిచాడు. వంటింట్లోంచి అమ్మ ఆకాష్ దగ్గర కొచ్చి ప్రేమగా తల నిమురుతూ చెప్పింది. " నూడుల్స్ ఒంటికి మంచివి కావురా. రోజూ అదే తింటే కడుపు నొప్పి వస్తుంది నాన్నా. ఇడ్లి చాలా మంచిది. ఇవి తిను కన్నా".

నాకిదేమి వద్దు. మా స్కూల్లో ఎవరూ ఇడ్లీలు



దోశలు తినరు. అందరూ పిజ్జాలు, బర్గర్లె తింటారు కోపంగా అన్నాడు ఆకాష్. అంతలో స్కూలు బస్ వచ్చిందని హారన్ కొట్టారు. ' కొంచెం తినమ్మా నీరసం వస్తుంది' అంటూ అమ్మ వెంట బడింది. ఈ లోపు ఇంకో రెండుసార్లు హారన్ మోగింది. ఆకాష్ బ్యాగ్ వేసుకొని ఖాళీ కడుపుతో కోపంగా వెళ్ళిపోయాడు.

క్లాసులో పాఠలు చెబుతున్నారు గానీ ఆకాష్ కి అవేమి ఎక్కటం లేదు. కడుపులో ఆకలి దంచేస్తుంది. పోనీ ఆ ఇడ్లిలన్నాతినేయల్సింది అనుకున్నాడు. అమ్మో ఇలా ఇడ్లీకి ఎడ్జస్ట్ అయిపోతే అమ రోజు అవే పెడుతుంది. అమ్మో అని అసలు తినలేం. కానీ అమ్మేమో " నూడుల్స్ వద్దురా కన్నా లావై పోతావు. ఇప్పటికే ఉండాల్సిన బరువు కన్నా పది కిలోల బరువు ఎక్కువున్నావు. నా మాటిను అంటుంది. ఏమో ఏది అర్థం కావట్లేదు.

స్కూల్లో సైన్స్ మాస్టారు ఈ రోజు జీర్ణాశయం గురించి పాఠం చెబుతున్నారు. మనం తీసుకున్న ఆహారం అరగటానికి దాదాపు మూడు గంటల సమయం పడుతుండట. మనం ఆహారం తీసుకోగానే ఎంజైమ్స్ యాసిడ్స్ ప్రవేశించి ఆహారాన్ని అరిగేలా చేస్తాయి. సరియైన సమయంలో ఆహారం తీసుకోకపోతే అవే యాసిడ్స్ పొట్టలోని కండల్ని కరిగిస్తాయి. అలా ఆహారం లేకుండా యాసిడ్స్ ఊరటం వలన అల్సర్లు వస్తాయి అయన పాఠం చెబుతున్నాడు గానీ నాకు మాత్రం లంచ్ బెల్ ఎప్పుడూ కొడతారా అనే ఆలోచన ఉన్నది.

సాయంత్రం పిజ్జా అడిగినా అమ్మ కొనిపెట్టలేదు. పాలు తాగమని ఇచ్చింది. ఆకాష్ మనసులో చాల కోపంగా ఉంది. ఆ రోజంతా అలా కోపంగానే గడిచింది. ఆ కోపంతో రాత్రికి ఏమి తినకుండానే నిద్ర పోయాడు. మనసు నిండా ఇవే ఆలోచనలు. కలలో జీర్ణాశయం కన్పించింది. బాగా ఏడుస్తూ కళ్ళ వెంట నీళ్ళు కారుతూ ఉంది. అదేంటి ఉదయం మాస్టారు పాఠం చెప్పేటప్పుడు బాగానే ఉంది కదా! మెల్లగా దగ్గర కెళ్ళాడు ఆకాష్. ' ఏంటి ఎందుకేడుస్తున్నావు' అన్నాడు మెల్లగా.

జీర్ణాశయం ఏడుస్తూ తన కథను చెప్పనారంభించింది. ఇరవై నాలుగ్గంటలు పనే అవుతుంది నాకీమధ్య. ఇంతకు ముందు రాత్రిపూట ఖాళి ఉండేది. ఇప్పుడు నైట్ షిఫ్టుల మూలంగా ఆ ఖాళి కూడా లేదు. ఎంసెట్ల కోసం పిల్లలు రాత్రి పగలూ చదువుతుండటం వల్ల, బలమని ఎదో ఒకటి తినడం వాళ్ళ నాకు రెస్ట్ లేకుండా పోయింది. ఈ మధ్య నేను పని చేయలేక డీలా పడిపోతున్నాను. నేను కాసేపు పడుకున్నానంటే మీ కడుపులోని పదార్థాలు అలాగే ఉండి కుళ్ళి పోతాయి. కుళ్ళిపోయి వాసనా వచ్చి గ్యాస్ గా మారుతుంది. మీరప్పుడు పొట్ట ఉబ్బరంగా ఉంది అంటూ బాధపడతారు.

" నీకు రెస్ట్ లేకపోవడం వాళ్ళ ఇలాంటి సమస్యలొస్తాయన్న మాట. మరి నీకు కాస్త ఖాళి సమయం ఉంటె చాలన్న మాట" అన్నాడు ఆకాష్.

లేదు బాబూ! మీరు తినే కొన్ని ఆహారలేదు బాబూ! మీరు తినే కొన్ని ఆహార పదార్థాలను నేను జీర్ణం చెయ్యలేకపోతున్నాను. నూడుల్స్ అని చైనా నుంచి కొత్తగా వచ్చాయి. వాటిని నేను అరిగించలేకపోతున్నా. నాలో పేరుకు పోయిన నూడుల్స్ ను ఒకబ్బాయి పొట్టలోంచి డాక్టరు ఆపరేషన్ చేసి తీసివేశాడు. అంత కష్టమయింది నాకు. ఈ విషయం వీడియో తీసి ఫేస్ బుక్ లో కూడా పెట్టారు చూశావా నువ్వు. ఇలా జీర్ణశయానికి అంటే నాకు హాని చేసే పదార్థాలు తినకుండా ఉంటే బావుంటుంది. ఎప్పుడన్నా ఒక్కసారి తినవచ్చు గానీ రోజూ అవే తింటుంటారు. అప్పుడు నాకు చాల సమస్యలొస్తాయి. నాకు సమస్యలొస్తే మీకు సమస్యలు వచ్చినట్లే. అనవసరమైన ఆహారం తినటం వల్ల ఒబెసిటి అనే సమస్య కూడా తీవ్రమైంది పిల్లల్లో. సరియైన వ్యాయామాలు లేక కూడా మీకు సమస్యలు వస్తున్నాయి. నాకైతే మీరు తిన్నవన్ని అరిగించాలంటే ఎంతో కష్టంగా ఉంటోంది. అంటూ తన కథ చెప్తూనే ఉంది జీర్ణాశయం.

మెలకువ వచ్చినా ఆకాష్ కు జ్ఞానోదయమైంది. జీర్ణాశయాన్ని కష్ట పెట్టే ఆహారం తీసుకోకూడదు అనుకున్నాడు. వెంటనే అమ్మతో చెప్పాడు ' ఇనొఇడ్లి చేశావా అమ్మా '! ఆకాష్ ఆరోగ్యంతో ఆనందంగా ఉన్నాడు.

డా.. కందేపి రాణీప్రసాద్.

## మొక్కుబడి ప్రసంగాలతో ప్రజలకు ఒరిగేదేమిటి?

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3 ): ప్రతిసారి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజు రాష్ట్రపతి చేసే ప్రసంగం ఒక లాంఛనప్రాయమే అయినా రాష్ట్రపతి ప్రసంగాలకు ఎంతో ప్రామాణికత ఉంటుంది. నిజానికి ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని మాత్రమే రాష్ట్రపతి చదువుతారు. అలాగే రాష్ట్రాల్లో గవర్నర్ ప్రసంగాలు కూడా ఇదే కోవలోకి వస్తాయి. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు తయారుచేసిన ప్రసంగ పాఠాలను చదువు తారు. అయితే రాష్ట్రపతి లేదా గవర్నర్లు ఈ సందర్భంగా ఏదైనా అభ్యంతరాలు చెప్పినల సందర్భం బహు అరుదు. మరో నాలుగు నెలల్లో తన పదవీకాలాన్ని పూర్తి చేసుకోబోతున్న రాంనాథ్ కోవింద్ 14వ రాష్ట్రపతిగా వెలువరించిన చివరి ప్రసంగం మొక్కుబడిగా ముగిసింది. అందుకుమనం రాష్ట్రపతిని తప్పుపట్టడానికి లేదు. అలా జరగగడానికి మోడీ సర్కార్ వైఫల్యంగా చూడాలి. ఆత్మవిమర్శ చేసుకుని ప్రసంగాన్ని రూపొందించి ఉంటే ఇలా జరిగేది కాదు. అనేకానేక సమస్యలను ప్రస్తావిస్తూ..పరిష్కరించిన వాటి గురించి ప్రసంగంలో ప్రస్తావించి ఉంటే హుందాగా ఉండేది. ప్రతి రాష్ట్రపతి, తన ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించడం మామూలే. కాని, ఇతర రాజకీయ నాయకులు సభలో చేసే ప్రసంగాలు, ఎన్నికల సభల్లో చేసే ప్రసంగాలకు అది భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ గణాంక వివరాలను ప్రస్తావించడం మాత్రమే కాక, దేశ ప్రజలను చైతన్యపరిచే, వారికి ఆత్మస్థయిర్యం కలిగించే, భవిష్యత్ పట్ల ప్రేరణ కలిగించే అనేక అంశాలు ఇందులో చోటుచేసుకుని ఉండాల్సింది. కాని రాంనాథ్ కోవింద్ తన చివరి ప్రసంగంలో కేవలం గణాంక వివరాలను మాత్రమే చెప్పి మోదీ సర్కార్‌ను ఆకాశానికెత్తడానికే పరిమిత మయ్యారు. ఇది కేవలం ఆయన తన సొంతంగా చేసిన ప్రంగంకాదు కనుక తప్పు పట్టడానికి లేదు. నిజానికి గత ఏడాదిగా కరోనాతో లక్షలాదికుటుంబాలు వేదన పడ్డాయి. వారిని ఆదుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ప్రతిపక్షాలు ఎంత నిరసన వ్యక్తం చేసినా పార్లమెంట్‌లో సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం ముందుకు రావడంలేదు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే అటు ప్రభుత్వ పక్షాన, ఇటు ప్రతిపక్షాల తరఫున సమర్థంగా మాట్లాడే నేతలు లేకపోవడం కూడా కారణంగా చూడాలి. ఆర్థిక సర్వేలోనే ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగిపోతున్న విషయాన్ని ప్రస్తావించారు.

గత డిసెంబర్‌లో రిటైల్ రంగంలో ద్రవ్యోల్బణం 5.6 శాతం పెరిగితే, టోకు ధరల ద్రవ్యోల్బణం అత్యధిక స్థాయిలో 14.2 శాతం పెరిగిందని ఆర్థిక సర్వే ప్రస్తావించింది. దీనిపై చర్చించి ముందుకు సాగే ఆలోచన ఎక్కడా కానరావడం లేదు. ప్రతిపక్షాలను రెచ్చగొట్టడం, వారు గందరగోళం సృష్టిస్తే నెపం వారిమీదకు నెట్టివేసి తమ ఇష్టారాజ్యంగా బిల్లులను ఆమోదింపచేసుకోవడం ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయింది.

# ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర నాగోబా

నాగోబా జాతర ప్రపంచంలోని అతి పెద్ద గిరిజన జాతరల్లో ఒకటి. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగో బా జాతరలో సర్పజాతిని పూజించ డమే ఈ పండగ ప్రత్యేకత. పుష్య అమావాస్య రోజు తమ ఆరాధ్య దైవమైన నాగోబా (శేష నారాయణ మూర్తి) పురివిప్పి నాట్యమాడు తాడని గిరిజనుల నమ్మకం. అమా వాస్య నాడు సరిగ్గా సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి పన్నెండు గంటల మధ్య కాలంలో గిరిజన పూజారులకు తమ ఆరాధ్య దైవం ఆదిశేషువు కనిపిస్తాడనీ, వారందిం చే పాలు తాగి ఆశీర్వదించి అదృశ్య మవుతాడని గిరిజనులు విశ్వసి స్తారు. ఆదిమ గిరిజనుల్లో మేస్రం వంశీయుల ఆరాధ్యదైవం నాగోబా గోండుల దేవత. నాగోబా దేవాల యం ఆదిలాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామం లో ఉంది. కెస్లాపూర్‌లో జరిగే ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిం చింది. కెస్లాపూర్ జనాభా 400కు మించదు. కాని పండగ నాడు లక్షలాది మందితో అది జనా రణ్యంగా మారుతుంది.

పుష్యమాస పౌర్ణమికి ఒక రోజు ముందు తమ కులదైవాన్ని పుష్య అమావాస్య రోజున అభిషే కించడానికి పవిత్ర గోదావరి జలం తేవడానికి కాలినడకన బయలుదేరి వెళతారు. కేస్లాపూర్‌కు సుమారు వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న కలమడుగు మండలం సమీపాన ఉన్న గోదావరి నదిలో హస్తమడుగు వరకు అరణ్యం గుండా నడచి వెళ్లి గోదావరి జలం కలశంతో తీసు కుంటారు. హస్తమడుగులో గిరిజ నుల పూర్వులు స్నానం చేస్తుండగా నాగదేవత ప్రత్యక్ష మయి దర్శన మయిందనే నమ్మకంతో అక్కడి జలాన్ని పవిత్ర జలంగా గిరిజనులు భావిస్తుంటారు.

పుష్య పౌర్ణమినాడు మేస్రం వంశీయులు 20 మంది గిరిజనులు వెంటరాగా కొత్త కుండలతో కడెం మండలం లోని గొడిసిర్యాల పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గోదావరి జలాన్ని తీసుకు వచ్చేందుకు బయలు దేరుతారు. దీంతో జాతర ప్రారంభమైనట్టే. ఆ జలాన్ని తీసుకు రావడానికి కెస్లాపూర్ నుంచి గోదా వరి దాకా కాలినడకన 80 కిలో మీటర్లు వెళ్తారు.





జనవరి 31న ప్రారంభమై, ఫిబ్రవరి 6 వరకు నిర్ణీత రోజుల పాటు గిరిజనులు ఈ పండుగ జరుపు కుంటారు. ఏటా పుష్యమాస అమావాస్య రోజున జాతర ప్రారంభ మవుతుంది. నాగోబాను కొలిస్తే పంటలు బాగా పండుతాయని, శాంతి విరాజిల్లు తుందని, రోగాలు మటు మాయమ వుతాయని గిరిజనుల నమ్మకం.

నాగోబా చరిత్రను గోండు గిరిజ నులు రకరకాలుగా చెప్పు కుంటా రు. పూర్వం మేస్రం కుటుం బానికి చెందిన నాగాయి మోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడని, ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పరూపంలోని నాగేంద్రునికి తల్లి అంటే రాణి తన తమ్ముడి కూతురు గౌరీతో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞ మేరకు గౌరీ భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరి కి ప్రయాణం కాగా, ఒకచోట పాము ఉడుం రూపంలో కనిపించగా ఆ ఊరు ఉడుంపూరైందని చెపుతారు. ఆ తరువాత గౌరి ధర్మపురి వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరు ప్రతిష్ఠలు కావాలో, సంప్రదాయం కావాలో తేల్చు కోమ నగా గౌరి సంప్రదాయాలను లెక్క చేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ. ఆ తరువాత ఉడుంపూర్ నుంచి గరిమెల వరకు అతనికోసం వెతికిన గౌరి గోదావరి లోనే సత్యవసి గుండంలో కలిసి పోయిందని, నాగేంద్రుడు ఆమె వెంట ఉంచిన ఎద్దు రాయిగా మారిందని భక్తుల విశ్వాసం. ఆ తరువాత పెళ్ళి అయిన ప్రతి జంటకు నాగేంద్రుడి సన్నిధిలో పరిచయం చేయాలని (పేథికొరి యాక్) చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లిపోయాడని చెప్తుం టారు. అదే కెస్లాపూర్ గ్రామంగా మారి పోయింది. నాగేం ద్రుడు వెళ్లిన గుట్ట వద్ద నాగోబా దేవాల యాన్ని నిర్మిం చారు. ప్రతి ఏటా పుష్య మాసం అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్షమ వుతాడని గిరిజనుల నమ్మకం. నాగోబా దేవత కు పూజలు మేస్రం వంశీయులే నిర్వహిస్తారు. మేస్రం వంశం కింద 22 తెగలు వస్తాయి. ఏడుగురు దేవతలను కొలిచే వారంతా మేస్రం వంశీయుల కిందికి వస్తారు. మడావి, మర్సకోల, పుర్క, మేస్రం, వెడ్మ, పంద్రా, పుర్వెత ఇంటి పేర్లు గలవారంతా మేస్రం వంశంలో వస్తారు.

వృత్తుల ఆధారంగా 17 శాఖలుగా చీలిన మోస్త్రం వంశస్థులలోని కటోడా దివాకర్ గారికి, ఘాడియా సంకేపాయిలర్ వాడే శాఖల వారు కేస్లాపూర్ జాతరకు 16 రోజుల ముందు కెస్లాపూర్ చేరుకొని జాతర ప్రాంగణంలోని గిరిజనులు చెప్పుకునే ప్రాశస్త్యం గల మర్రి చెట్టు కింద విడిది చేసి అమావాస్య రోజు రాత్రి నాగోబాకు కొత్త కుండల్లో గోదావరి నుంచి తెచ్చిన నీళ్లతో అభిషేకం చేస్తారు. తరువాతే క్షీరాభిషేకం చేసి గిరిజన ఆచారాల మేరకు పూజలు నిర్వహిస్తారు. జాతరకు వచ్చే మేస్రం వంశీయులు వేలాది మంది ఉన్నా వారు వంట చేసుకునేది మాత్రం 22 పొయ్యిల మీదే. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ లోపల, గోడకు చుట్టూ దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక అరలు (దుగుడు) ఉన్నాయి. ఆ దీపాల కాంతుల వెలుగులో 22 పొయ్యిల్లో మేస్రం వంశీయుల వంతుల వారిగా వంటలు చేసుకుంటారు. మిగితా జాతుల వారు ఎక్కడైనా వంట చేసుకోవచ్చు. ఇచ్చోడ మండలం సిరికొండలోని గుగ్గిల్ల వంశీయులు మాత్రమే నాగోబా కోసం కుండలు తయారు చేయడం ఆచారంగా వస్తోంది. పుష్యమాసంలో నెలవంక కనిపించిన తరువాత మెస్రం వంశీయులు ఎడ్ల బండ్లలో సిరికొండకు వస్తారు. అక్కడి గుగ్గిల్ల వంశస్థుడైన కుమ్మరి ఇళ్ళకు వెళ్లి, కుండలు తయారు చేయాలని కోరుతారు. వంటల కోసం రెండు పెద్ద కుండలు, (కాగులు), వాటిపై కప్పిపెట్టేందుకు పాత్ర (చిప్పలు), దీపాంతలు, నీటికుండలు కలిపి తయారీకి ఆర్డర్ ఇస్తారు. మేస్రం వంశీయులు ఈ కుండల్లోనే గంగా జలాన్ని తీసుకురావడమే కాకుండా, వంట చేసి జాతరలో భక్తులకు భోజనం పెడతారు.

కేస్లాపూర్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఇంద్రవెల్లిలో ఆగి, అక్కడ వెలిసిన ఇంద్రాదేవికి సామూహికంగా పూజలు జరుపు తారు. ఇక్కడి నుంచి కేస్లాపూర్ చేరి ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న మర్రిచెట్టు కింద నాలుగు రాత్రులు, ఒక పాకలో మూడు రాత్రులు సామూహిక పూజలు జరిపి కేస్లాపూర్ మందిరానికి వాయి ద్యాలతో ఊరే గిస్తూ తెచ్చి ఆలయం వద్ద ఉన్న మర్రి చెట్టుపై పవిత్ర జలకలశం భద్రపరిచి, పది కిలోమీటర్ల దూరం లోని సిరికొండ చేరుకుంటారు. సరిగ్గా పుష్య అమా వాస్య రోజున కలశం భద్ర పరిచిన మర్రిచెట్టు దగ్గర బావినీరు మట్టి కలిపి ఒక పుట్టను తయారు చేసి ఆలయం పక్కన ఉన్న పూల మందిరాన్ని ఆ మట్టితో అలికి అమావాస్య అర్ధ రాత్రి కలశంలో ఉన్న జలంతో ఆలయంలో ఉన్న నాగదేవతను అభిషేకిస్తారు.

గోదావరి నదినుంచి తెచ్చిన జలంతో నాగోబా విగ్రహాన్ని శుభ్ర పరుస్తారు. ఆలయాన్నంతా శుద్ధి చేస్తారు. బాజా భజంత్రీలతో ఆలయ ప్రాంగణంలో పూజా కార్య క్రమాలకు నిర్వహిస్తారు. ప్రత్యేక పూజ సమయంలో మొలకెత్తిన నవ ధాన్యాలను తెస్తారు. ఒక రాగి చెంబులో పాలను తీసుకుంటారు. నవ ధాన్యాలు, మొలకలు, పాలు అన్నిటికీ ఒక కొత్త రుమాలుతో కప్పి పుట్టపైన ఉంచుతారు. పుట్టమీది రుమాలు 'పైకెత్తినట్లు' కనిపిస్తే పూజా కార్యక్రమాలను ఆరం భిస్తారు. ఇప్పటికీ నాగ దేవుడు రాగి చెంబులోని పాలు తాగు తాడనే విశ్వాసం వారిలో ఉంది.

మెస్రం వంశస్థుల్లో వివాహమైన నూతన వధువులను తప్పక కేస్లాపూర్‌లో నాగోబా దేవుని వద్దకు తీసుకెళతారు. ఆమె చేత ఆ దేవునికి పూజ చేయించి వధువును పరిచయం చేస్తారు. దీన్నే 'భేటింగ్ కీయ్‌వాల్' అంటారు. వధువులు ఇంటి నుంచి ఎడ్లబండి వెనుక వెదురు బుట్టలో పూజ సామాగ్రిని ఉంచుకుని, కాలినడకన బయలు దేరతారు. కేస్లాపూర్‌లోని నాగోబా గుడిని చేరుకుంటారు. పరిచయం చేయాల్సిన వధువులను 'భేటి కొరియాడ్' అని పిలుస్తారు. పూజలకు ముందు నాగోబా దేవుని దగ్గరకు వారిని తీసుకెళ్లి పరిచయం చేస్తారు. అక్కడి నుంచి శ్యాంపూర్ లోని (బోడుందేవ్) జాతర అయ్యాక ఎవరి గృహాలకు వాళ్లు వెళతారు.

గతంలో మారుమూల గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు లేవు. నాగరి కులంటేనే ఆదివాసులు పరుగెత్తే వారు. గిరిజనుల వద్దకు అధికారు లెవరు వెళ్లేవారు కాదు. అప్పుడే భూమి కోసం, విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి కొమురం భీం మరణించాడు. ఈ సంఘట నతో ఉలిక్కిపడ్డ నిజాం ప్రభువులు గిరిజన ప్రాంతాల పరిస్థి తులు, గిరిజనుల స్థితిగతులపై అధ్యయ నం చేసేందుకు ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ ను ఆదిలాబాద్ జిల్లాకు పంపగా, కొండలు, కోనలు దాటి వచ్చే గిరిజనుల సమస్యలను తెలుసు కొని పరిష్కరించేందుకు జాతరలో దర్బార్‌ను ప్రొఫెసర్ 1942లో మొదట నిర్వహించాడు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. జాతర చివరి రోజున జరిగే ఈ దర్బార్‌కు గిరిజన పెద్దలు, తెగల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజర వుతూ ఉంటారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు.

ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 6 వరకు నిర్వహిస్తు న్నారు. మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్ పటేల్, పెద్దలు చిన్ను పటేల్ ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు, కార్యక్ర మాలు, మెస్రం వంశీయులు నిర్వహించే మహా పూజలతో పాటు రోజువారీ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.

నాగోబా జాతరలో, కొవిడ్–19 నేపథ్యంలో కెస్లాపూర్ నాగోబా జాతరలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నాగోబా జాతరను విజయవంతం చేయాలని ఆదిలా బాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# కేసీఆర్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

- రాజ్యాంగంపై వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను అవమానించడమే
- మోడీ, కేసీఆర్ ఆలోచనా ధోరణలు కూడా ఒక్కటే
- గాంధీభవన్ కాంగ్రెస్ దీక్షలో మల్లు రవి విమర్శలు
- రాజ్యాంగాన్ని మార్చాలనడం దేశంపై దాడిగా చూడాలి
- కేసీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు
- కేసీఆర్ మేకవన్నెపులి అని తేలిందన్న భట్టి



హైదరాబాద్,ఫిబ్రవరి3: ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని మార్చాలని అనడం ద్వారా ఆయన అంబేద్కర్‌ను అవమానించారని అన్నారు. గగాంధీభవన్‌లో చేపట్టిన దీక్షలో మల్లు గురువారం మాట్లాడుతూ ఎందుకు రాజ్యాంగం మార్చాలో సీఎం కెసిఆర్ వివరంగా చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మోదీ రాజ్యాంగాన్ని తీసుకురావాలని సీఎం కేసీఆర్ చూస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీతో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని, ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పే వరకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందని మల్లు రవి స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని మార్చడం అంటే అంబేద్కర్‌ను అవమానించడమేనని కాంగ్రెస్ సీనియర్ నేత అన్నారు. సీఎం కేసీఆర్ దేశానికి కొత్త రాజ్యాంగం అవసరమని చెప్పడంతో గొప్ప మహానుభావుడు రాసిన భారత రాజ్యాంగాన్ని అవమానపరిచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులను కాలరాయడమేనని అన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్న తరుణంలో రాష్ట్రంలో సీఎం కేసీఆర్ భారత రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరముందని అనడం చూస్తుంటే భారత రాజ్యాంగం విషయంలో మోదీ, కేసీఆర్ ఇద్దరు కూడా ఒకటేనని అర్థం అయ్యిందన్నారు. ప్రజలను మభ్య పెట్టడానికి నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ రాజ్యాంగంపై చేసిన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి సీఎంగా కేసీఆర్ అనర్హుడన్నారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. మహాత్మాగాంధీ దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి స్వాతంత్రం తెచ్చిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ప్రపంచ దేశాల్లో శాంతి మానవత్వానికి మరో పేరుగా మహాత్మాగాంధీని అందరూ గుర్తిస్తారు. అలాంటి గాంధీని చంపిన గాడ్సేకీ బీజేపీ ప్రభుత్వం విగ్రహాలు కడుతుందన్నారు. ప్రపంచదేశాల ముందు నవ్వుల పాలు అవుతుందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు దేశంపై దాడిగా చూడాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ ప్రశ్నించే చట్టబద్ధతను రాజ్యాంగం కల్పించిందన్నారు. దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ సమానమే అని రాజ్యాంగం చెప్పిందని, ఇప్పుడు సీఎం ప్రకటనతో కేసీఆర్ మేకవన్నె పులి అని తెలిపోయిందన్నారు. అందరం ఏకమై రాజ్యాంగాన్ని కాపాడుకుందామని పిలుపిచ్చారు. సీఎం కేసీఆర్ టక్కు టమార, గోకర్ణ మాయలతో దేశాన్ని మోసం చేస్తున్నారని, రాజ్యాంగంపై అవగాహన లేని కేసీఆర్ సీఎంగా ఉండడం దురదృష్టకరని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ గ్రామ స్థాయి ఫ్యూడల్ నాయకుడిగా మాట్లాడారని విమర్శించారు. ఎమ్మార్పిఎస్ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ప్రకటనలను తాను ఏకీభవిస్తానన్నారు. దేశం, రాష్ట్రం రెండుగా విభజించే రోజులు దగ్గర పడ్డాయని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన వ్యక్తి మాట మార్చడం అనేది సరి కాదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. రాజ్యాంగం వ్యతిరేకించిన వ్యక్తులు కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని, రాజ్యాంగం ద్వారానే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారన్నారు. కొత్త రాజ్యాంగం కావాలంటే తెలంగాణ రాష్ట్రాన్ని కాదన్నట్లే కదా అని ఆయన అన్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత 65 సార్లు హై కోర్టు ప్రభుత్వానికి చీవాట్లు పెట్టిందని, నీకు దమ్ము ధైర్యం ఉంటే నీ కేసులు నిరూపించుకో అని కేసీఆర్‌కు పొన్నాల సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిగా ఉండగానే ఈ డీ అధికారులు కేసీఆర్ దగ్గరకు వచ్చారని ఆయన విమర్శించారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ దీక్షలో ఆయన మాట్లాడుతూ ..ముఖ్యమంత్రి మాట్లాడిన అంశాలు సిగ్గు చేటని ఆయన మండిపడ్డారు. అసలు కొత్త రాజ్యాంగం ఎందుకో కేసీఆర్ సమాధానం చెప్పాలని, నీ కుటుంబ సభ్యులు పాలించడానికేనా కొత్త రాజ్యాంగం అని ఆయన ఎద్దేవా చేశారు. నువ్వు పార్టీ పె÷–టటె ముందు తెలంగాణ గురించి ఎప్పుడైనా మాట్లాడవా, నయీం కేసు ఏమి అయింది, ఇప్పటి వరకు ఇక్కడ వెలగపెట్టి.. ఇప్పుడు దేశం గురించి మాట్లాడతావా.. కేసీఆర్ మాట్లాడిన మాటలు దేశ ద్రోహం, రాజ్యాంగ ధిక్కరణ కింద వస్తాయి అని ఆయన వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ రాజ్యంగం మార్చాలన్న మాటల వెనుక పెద్ద కుట్ర ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. ముఖ్యమంత్రి వెనుక ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ వున్నారన్నారు. అమిత్ షా దగ్గర పనిచేసేటోడు ప్రగతి భవన్‌లో పని చేస్తుండని.. పీకేతో ఒప్పందం చేసుకున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని అడ్డుకోడానికి దొరలు చూస్తున్నారని, సీఎం కేసీఆర్‌కు బొంద పెట్టె రోజులు దగ్గర పడ్డాయన్నారు. 95 నుంచి 105 సీట్లు వస్తాయని ముఖ్యమంత్రి చెబుతున్నారంటే అర్థం చేసుకోవచ్చునని.. బీజేపీ, టీఆర్ఎస్ రెండు దొంగలేనని అద్దంకి దయాకర్ విమర్శించారు. గాంధీభవన్‌లో జరిగిన దీక్షలో అద్దంఇక మాట్లాడుతూ కెసిఆర్ తీరును తూర్పారబట్టారు. రాజ్యాంగాన్ని మార్చాలని అంటున్న సీఎం కేసీఆర్‌పై ఏఐసీసీ అమలు కమిటీ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. దళిత అణగారిన ప్రజలని అణగతొక్కాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. మీతో ఎవరు ఆమాటలు చెప్పించారో చెప్పాలని నిలదీశారు. ముందు నుంచి బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని.. కేసీఆర్ శాశ్వతంగా ముఖ్యమంత్రిగా ఉండటానికి రాజ్యాంగం మార్చాలనుకుంటున్నారని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగం మార్చాలని బీజేపీ దీక్షలు చెయ్యడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజ్యాంగం మార్చాలన్న కేసీఆర్‌పై దేశ ద్రోహం కేసు పెట్టాలన్నారు. కేసీఆర్‌ని బీజేపీ భయపెట్టి అ మాటలు మాట్లాడిస్తోందని మహేశ్వర్‌రెడ్డి పేర్కొననారు.

## కరోనా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

### ప్రత్యక్ష బోధనతో పాటు ఆన్‌లైన్ తరగతులకు అనుమతించాలి
### ప్రభుత్వానికి సూచించిన రాష్ట్ర హైకోర్టు

హైదరాబాద్,ఫిబ్రవరి3: రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై హైకోర్టు విచారణ చేపట్టింది. విద్యాసంస్థల్లో ఆన్‌లైన్ బోధన



కూడా కొనసాగించాలని ఆదేశించింది. ఈనెల 20 వరకు ప్రత్యక్ష తరగతులతో పాటు ఆన్‌లైన్ బోధన కొనసాగించాలంది. ఫిబ్రవరి 20వ తేదీ వరకు ప్రత్యక్ష తరగతులతో పాటు.. ఆన్‌లైన్ బోధన కూడా కొనసాగించాలని సూచించింది. హైదరాబాద్‌లో మార్కెట్లు, బార్లు, రెస్టారెంట్ల వద్ద కొవిడ్ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారో తెలపాల్సిందేనని అన్నారు. సమ్మక్క జాతరలో కరోనా నియంత్రణ చర్యలు అమలు చేయండి. సమతామూర్తి సహస్రాబ్ది వేడుకల్లో కొవిడ్ నిబంధనలు అమలయ్యేలా చూడాలని కూడా హైకోర్టు సూచించింది. నిర్లక్ష్యం వల్ల కరోనా ప్రబలకుండా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యతని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఃూష్ట్రంలో కరోనా పరిస్థితులపై ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు హైకోర్టుకు నివేదిక సమర్పించారు. రాష్ట్రంలో కరోనా తగ్గుముఖం పడుతోందని పాజిటివిటీ రేటు 3.40శాతం ఉందని తెలిపారు. జీహెచ్ఎంసీలో 4.64 శాతం, మేడ్చల్‌లో 3.76 శాతం పాజిటివిటీ రేటు ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఃూష్ట్రంలో కరోనా పాజిటివిటీ రేటు తగ్గింది. అత్యల్పంగా గద్వాలలో 1.45శాతం పాజిటివిటీ రేటు ఉంది. 99 లక్షల ఇళ్లల్లో ఫీవర్ సర్వే చేశారు. కొవిడ్ లక్షణాలు ఉన్న 4.32 లక్షల మందికి మెడికల్ కిట్లు అందించాం. పిల్లల చికిత్సకు ఆస్పత్రుల్లో తగిన ఏర్పాట్లు చేశాం. రోజుకు లక్షకు పైగా కరోనా పరీక్షలు జరుగుతున్నాయి. మేడారం జాతరలో కొవిడ్ నిబంధనల అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిమని. కరోనా పరీక్షలు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు సిద్ధం చేశామని హైకోర్టుకు ఇచ్చిన నివేదికలో వెల్లడించారు.విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోవద్దనే ఉద్దేశంతోనే పాఠశాలలు తెరిచినట్లు విద్యాశాఖ హైకోర్టుకు తెలిపింది. విద్యాసంస్థల్లో కొవిడ్ నియంత్రణ చర్యలు అమలు చేస్తున్నట్లు నివేదికలో డీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. రెండు వారాల్లో కరోనా ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలని హైకోర్టు సూచించింది. కరోనా పరిస్థితులపై విచారణ ఈనెల 20కి వాయిదా వేసింది.

## శరవేగంగా సచివాలయ నిర్మాణ పనులు

### ఇంటీరియర్ డిజైన్స్‌పై ఆర్కిటెక్కులతో మంత్రి సమీక్ష
### సిఎం కేసీఆర్ ఆమోదించాక పనుల్లో వేగం

హైదరాబాద్,ఫిబ్రవరి3: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ వైభవానికి ప్రతీకగా నూతన సచివాలయం నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర రోడ్లు–భవనాలు,గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. అలాగే సచివాలయ అంతర్గత సుందరీకరణ, ఫర్నిచర్ డిజైన్స్ అందుకు అనుగుణంగా ఉంటాయని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు సెక్రటేరియట్ నిర్మాణంపై గురువారం ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఆర్కిటెక్ట్ లు, అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. నూతన సచివాలయంలోని ఫర్నిచర్,ఇంటీరియర్ లకు సంబంధించిన క్లాసికల్,సెమి క్లాసికల్,మాడ్రన్ డిజైన్‌లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి పరిశీలించారు.ఆర్కిటెక్ట్ లు తయారు చేసిన ఇంటీరియర్ డిజైన్స్ వారు రూపొందించిన పలు ఫర్నిచర్ డిజైన్లను మంత్రి పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇంటిరియర్స్‌లో ఫ్యానెలింగ్ పనులు,మౌల్డింగ్ పనులు, ఫాల్ సీలింగ్ డిజైన్ పనులు, రంగుల కూర్పు వాటికి క్లాసికల్,సెమి క్లాసికల్,మాడ్రన్ ప్యాట్రన్ లలో డిజైన్ తయారు చేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమర్పించాలని అన్నారు. ఆయన నిర్ణయం మేరకు డిజైన్ లు ఫైనల్ చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది కోసం వర్కింగ్ స్టేషన్ నమూనాలు, కార్యదర్శుల ఛాంబర్‌లు, మినిస్టర్స్ ఛాంబర్‌లలో ఏర్పాటు చేసే ఫర్నిచర్ల నమూనాలు కూడా పరిశీలించారు. వాటిలో నుండి 3 రకాల ఫర్నిచర్‌లను షార్ట్ లిస్ట్ చేసి ముఖ్యమంత్రి పరిశీలించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. కెసీఆర్ ఆలోచనల ప్రకారం సీఎం పేషీ, వివిఐపి వెయిటింగ్ హాల్, వివిఐపి డైనింగ్ హాల్, రెండు స్కై లాంజ్ లు,క్యాబినెట్ హాల్ డిజైన్ లు తెలంగాణ వైభవానికి ప్రతీకగా ఉండేలా చూడాలని ఆర్కిటెక్ట్ లను మంత్రి ఆదేశించారు. అన్ని విభాగాల పనులు సమాంతరంగా ఏకకాలంలో చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్ అండ్ బి ఈఎన్సీ గణపతి రెడ్డి,ఈ.ఈ శశిధర్,ఎస్.ఈ సత్యనారాయణ,ఆర్కిటెక్ట్ లు ఆస్కార్,పొన్ని,షాపూర్ జి వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి తప్పడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

### విద్యార్థి సోషల్ మీడియాకు హరీష్ సూచనలు

యాదాద్రి భువనగిరి,ఫిబ్రవరి3: ఏ అంశంలో చూసినా తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. గురువారం ఆలేరు నియోజకవర్గ యువజన విద్యార్థి సోషల్ మీడియా విభాగం సమావేశంలో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. బిజీపి ఫేక్ వాట్సప్ ప్రచారం చేస్తుంది. బిజెపి నేతలు జూటా మాటలు మాట్లాడుతున్నారు. తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలి. ఆరోగ్య రంగంలో తెలంగాణ దేశంలో మూడో స్థానం లో ఉంది. డబుల్ ఇంజన్ గ్రోత్ అని చెప్పుకునే వాళ్ల యూపీ అట్టడుగున ఉంది. ఇక్కడి బండి, గుండు మాటలు చెప్పుమంటే కోటలు దాటుతయి. మేం అడ్డుకుంటే ఒక్కరు కూడా తిరుగలేరు బయట. కేంద్రంలో ఖాళీగా ఉన్న 15 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని మేమంటే.. 7 లక్షల ఉద్యోగాలే ఖాళీ ఉన్నాయి అంటరు. కనీసం ఇదన్న ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు. రాజ్యాంగం గురించి సీఎం కేసీఅర్ ఏం తప్పు మాట్లాడారు. నేను రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారనీ, అవసరం అయితే రద్దు చేయాలి అని అంబేద్కరే చెప్పారు. దేశంలో రాజ్యాంగ స్ఫూర్తి పోతుందని న్యాయం చేయాలి అంటున్నాం. జనాభా ప్రాతిపదిక రిజర్వేషన్లు పెంచాలి అంటే పట్టించుకోరు. బిజెపి అంటేనే కోతలు.. కోతలు తప్ప ఏం లేదు. 5 రాష్ట్రాల ఎన్నికలు కాగానే వాతలు పెడుతారు. పెట్రో డీజిల్ గ్యాస్ ధరలు పెంచడానికి సిద్దంగా ఉన్నారు. బ్జడెట్ లో తెలంగాణకు ఒకటన్న ఉందా..కేంద్రం తెలంగాణను చిన్న చూపు చూస్తుంది. ఇక్కడి బీజెపి నేతలకు నైతికత లేదు. ముల్లును ముల్లు తోనే తీయాలి. అంత కంటే గట్టి సమాధానం చెప్పాలి. తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా తిప్పి కొట్టాలని అన్నారు.



## 5న నగరంలో ప్రధాని మోడీ పర్యటన

### ముచ్చింతల్‌లో రామానుజ విగ్రహావిష్కరణ
### ఇక్రిశాట్ స్వర్ణోత్సవాల్లో పాల్గొననున్న ప్రధాని
### మోడీ పర్యటనకు భారీగా బందోబస్తు ఏర్పాటు
### అధికారులతో సమిక్షించిన సీఎస్ సోమేశ్

హైదరాబాద్,ఫిబ్రవరి3: ప్రధాన మంత్రతి నరేంద్ర మోదీ ఈ నెల 5 తేదీన తెలంగాణలో పర్యటించనున్నారు. ఆయన ముచ్చింతల్, ఇక్రిసాట్‌లలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు సీఎస్ సోమేశ్ కుమార్ తెలిపారు.

భద్రతకోసం అవసరమైన ఏర్పాట్లను చేయాలని, కోవిడ్ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు జరగాలని అన్నారు. టూర్‌లో పాల్గొనేవారి వద్ద ఆర్టీపీసీఆర్ టెస్ట్ రిపోర్ట్ ఉండాలని అన్నారు.

ఈనెల 5 వ తేదీన ప్రధాని మోడీ హైదరాబాద్‌లో జరిగే రెండు కార్యక్రమాల్లో పాల్గొనబోతున్నారు. ఇక్రిశాట్‌లో జరుగుతున్న స్వర్ణోత్సవాల్లోనూ, శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ చినజీయర్ స్వామివారి ఆశ్రమంలో నిర్వహిస్తున్న శ్రీరామానుజాచార్యుల సహస్రాబ్ది ఉత్సవాల్లోనూ ప్రధాని పాల్గొననున్నారు. ముచ్చింతల్‌లోని సమతామూర్తి శ్రీరామానుజాచార్యుల 216 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేయనున్నారు. పర్యటన ఏర్పాట్లకు సంబంధించి గురువారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం బీఆర్కే భవన్‌లో నిర్వహించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయడంతో పాటు,ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పని చేయాలని సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ప్రధాని పాల్గొనే వేదికల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లతోపాటు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తును బ్లూ బుక్ ప్రకారం ఏర్పాటు చేయాలని ఆయన పోలీసు శాఖను ఆదేశించారు. వేదికల వద్ద తగు వైద్య శిబిరాలతోపాటు, నిపుణులైన వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశించారు. వీవీఐపీ సందర్శన సమయంలో కోవిడ్–19 ప్రోటోకాల్ పాటించేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిని ఆయన ఆదేశించారు. వీవీఐపీ పాస్ హోల్డర్లకు షెడ్యూల్ చేసిన ప్రోగ్రామ్‌కు ముందే ఆర్టీపీసీఆర్ పరీక్షలను చేపట్టాలని, కోవిడ్–19 స్క్రీనింగ్ బృందాలను పెద్ద సంఖ్యలో నియమించాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి కాన్వాయ్ ప్రయాణించే రహదారుల మరమ్మతు పనులు చేపట్టాలని, తగినంత లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆర్‌అండ్ బీ శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. వీవీఐపీలు సందర్శించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. శంషాబాద్ విమానాశ్రయం, ఇతర వేదికల వద్ద ఏర్పాట్లను కార్యక్రమాల నిర్వాహకులతో సమన్వయం చేయాలని రంగారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్లను ఆదేశించారు.ఈ సమావేశంలో డీజిపిమహేందర్ రెడ్డి, ఇంధన, హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ , జిఏడి ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శ ఎస్.ఏ.ఎం రిజ్వీ, రవాణా, రోడ్డు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, మెదక్ జిల్లా కలెక్టర్ హరీశ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దళితులను అవమానించిన సిఎం కెసిఆర్

### దళితుడని సిఎం చేస్తానని మోసం చేశాడు
### సోషల్ మీడియా వేదికగా విజయశాంతి ఫైర్

హైదరాబాద్,ఫిబ్రవరి3: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని సీఎం కేసీఆర్ అవమానించారంటూ.. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ నేత విజయశాంతి సోషల్ మీడియాలో తీవ్రంగా స్పందించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం పెట్టిన భిక్ష వల్లే కేసీఆర్.. సీఎం పదవిని అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టి మరి మాట్లాడిన భాషను చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉండి దేశ ప్రధానిని, మహిళా ఆర్థికమంత్రిని అవమానపరిచేలా కేసీఆర్ మాట్లాడడం సిగ్గుచేటు. మొదటి నుంచి దళితుల పట్ల ప్రేమ ఉన్నట్లు నటించిన కేసీఆర్... పార్లమెంట్ సమావేశాల ముందు దళిత సామాజిక వర్గం నుంచి వచ్చిన రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించడంతోనే ఆయన బండారం బట్టబయలైందన్నారు. ఇదే భారత రాజ్యాంగం గూర్చి సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన అసలు నిజ స్వరూపాన్ని బయటపెట్టాయన్నారు. కేసీఆర్ అనుభవిస్తున్న సీఎం పదవి భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ గారు పెట్టిన బిక్షేనని గుర్తించాలి. స్వరాష్ట్రం ఏర్పడితే తెలంగాణకు తొలి ముఖ్యమంత్రి దళితుడే అని చెప్పి... చివరికి తానే ముఖ్యమంత్రి అయిన దళిత ద్రోహి కేసీఆర్ అన్నారు. హైదరాబాదులో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని పెడతానని చెప్పి దళితుల ఓట్లను కొల్లగొట్టి ఇప్పటికీ విగ్రహం పెట్టకపోగా... ఏడేండ్ల ఏలుబడిలో ఏనాడూ అంబేడ్కర్ జయంతి, వర్ధంతులకు హాజరై ఆ మహనీయుడి ఫొటోకు పూలదండ వేసిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలోని దళిత సమాజం కేసీఆర్ కుట్రలను తిప్పికొట్టాలి. రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ గారిని, రాజ్యాంగాన్ని కించపరిచే ఈ అహంకార ముఖ్యమంత్రికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు.

### రాజ్యాంగం నీ జాగీర్ కాదు కెసిఆర్: విహెచ్

హైదరాబాద్,ఫిబ్రవరి3: ’ రాజ్యాంగం నీ అయ్య జాగీరా కేసీఆర్ ? అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చాలంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను వీహెచ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే దేశానికి నిజమైన స్వాతంత్యం వచ్చిందన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఎప్పుడు ఏర్పాటు చేస్తానన్న కేసీఆర్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదన్నారు. కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ప్రజలే బుద్ధి చప్తారని వీహెచ్

## రాజ్యాంగాన్ని కాదు..కెసిఆర్,మోడీలను మార్చాలి

### అంబేడ్కర్‌ను అవమానించే అధికారం ఎవరిచ్చారు
### ములుగు జిల్లా నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు,ఫిబ్రవరి3: మర్చాల్సింది భారత రాజ్యాంగాన్ని కాదు ..ముఖ్య మంత్రి కెసిఆర్ ను, నరేంద్ర మోడీని అని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని కెసిఆర్ మాట్లాడటం తగదని మండిపడ్డారు. ములుగు జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం మాట్లాడారు. సీఎం కేసీఆర్ బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం ఆత్మగౌరవం కోసం డా. బీఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతి రావు పూలె , కొమరం భీం ఎంత పోరాటం చేశారని, ఎన్నో త్యాగాలు చేశారని వారి కంటే గొప్పవారా మీరు..? అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని కెసిఆర్ వ్యాఖ్యానించడం దురదృష్టకరమని సీతక్క అన్నారు. బడుగు బలహీన వర్గాలు, సమాజంలో ప్రతి ఒక్కరు సమాన హక్కులతో బ్రతకాలని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ చే రచించబడ్డ మన భారత రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలు కీర్తిస్తే మీరు ఇప్పుడు ఆ రాజ్యాంగాన్ని మార్చాలని అంటారా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ విషయం పై మిమ్మల్ని ప్రశ్నిస్తే బలహీన వర్గాలైన మమ్మల్నికుక్కలు నక్కలుఅంటారా..? అంటూ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని మార్చాలని చెప్పడం ఎంత అహంకారం..? అంటూ మండిపడ్డారు. పాలకులు అందరూ గతంలో మాదిరిగా రాచరిక వ్యవస్థకు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే సీతక్క అసహనం వ్యక్తం చేశారు. అందరినీ సమానంగా చూస్తామని చేసిన ప్రతిజ్ఞ ను తెలంగాణ సీఎం కేసీఆర్ మర్చిపోయారా అంటూ ఆమె ప్రశ్నించారు. కుటుంబ వ్యవస్థ తెచ్చి సమాజంలో అసమానతలు సృష్టించేందుకు, అట్టడుగు వర్గాలను అణగదొక్కేందుకు కుట్రలు చేస్తున్నారని సీతక్క ధ్వజమెత్తారు. రాచరికకాలం తరహాలో దేశాన్ని, రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే హక్కు మీకు లేదని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే సీతక్క కేసీఆర్‌కు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవళి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నల్లెల కుమారస్వామి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బనోత్ రవి చందర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇరుస వడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## పిల్లలు చిన్నవయసు నుండే సేవాదృక్పతం అలవరచుకోవాలి

### - మేయర్ సునీల్ రావు

**కరీంనగర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** కరీంనగర్ పట్టణం భగత్ నగర్ కు చెందిన పండుగ నాగరాజు కుమార్తె అనన్య పుట్టినరోజు సందర్భంగా పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు భగత్ నగర్ అలయన్స్ క్లబ్ అధ్యక్షులు చీకోటి శ్రీనివాస్ గాంధీ చేతుల మీదుగా ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా కరీంనగర్ పట్టణ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ.... చిన్నతనం నుండే పిల్లలకు సేవా భావం నేర్పితే సమాజంలో గొప్పవారు అవుతారని, కావున ప్రతి ఒక్కరూ పిల్లలకు మంచి నడవడిక నేర్పాలన్నారు.

## బిజెపి భీమ్ దీక్ష, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

**చిల్పూర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** మండలంలోని పల్లగుట్ట గ్రామంలో భారతీయ జనతా పార్టీ బిజెపి భీమ్ దీక్ష నిర్వహించడం జరిగింది. కెసిఆర్ గారు భారత రాజ్యాంగం నీ అవమానించినందుకు అంబేద్కర్ కాళ్ల మీద పడి వెంటనే క్షమాపణ చెప్పాలని సీఎం కేసీఆర్ అంబేద్కర్ కు, ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని అన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలవేసి దీక్ష చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు ముక్క స్వామి, మండల పార్టీ బిజెపి అధ్యక్షులు బిజెపి పెండ్యాల దిలీప్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి తోకల సంపత్ రెడ్డి, దళిత మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు యనమల వెంకట స్వామి, బిసి మోర్చా మండల అధ్యక్షుడు బాలినేని శ్రీనివాస్, సీనియర్ నాయకుడు కన్నెబోయిన రవి, అనగోని సంపత్ బండి శ్రీకాంత్, బెల్లి సంతోష్, కనేబోయిన కృషబాబు, బండి రమేష్, చీమల వినయ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పిట్టల రమేష్, చిల్పూర్ బూత్ అధ్యక్షుడు దామెర ప్రశాంత్ పాల్గొన్నారు.

## మేయర్‌ను సన్మానించిన డ్రైవర్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం

**కరీంనగర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** కరీంనగర్ నగర పాలక సంస్థలు పని చేస్తున్న ట్రాక్టర్ మరియు స్వచ్ఛ ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం పట్టణ మేయర్ సునీల్ రావు ను కలిసి వారికి శాలువతో సన్మానించి కృతజ్ఞతలు



తెలిపినారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్స్ ఆటో కాంట్రాక్ట్ డ్రైవర్ అసోసియేషన్ గౌరవఅధ్యక్షులు మరియు టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టిఆర్ఎస్ కార్మిక విభాగం మాజీ అధ్యక్షులుఎల్ రూప్ సింగ్ మరియు తెలంగాణ రాష్ట్ర సమితి కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి మరియు నూతనంగా ఎన్నుకోబడిన డ్రైవర్స్అసోసియేషన్ అధ్యక్షులు పొన్నం లింగయ్య ఉపాధ్యక్షులు కోనేటి సమ్మయ్య కోశాధికారి సుంకరి లక్ష్మణ్ మరియు నగరపాలక సంస్థ పారిశుద్ధ కార్మికుల సంక్షేమ సంఘం నాయకులు గడ్డం సంపత్, దావు రాజమల్లయ్య, గాలి శ్రీనివాస్ పారునంది ఎల్లయ్య, పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలి

**నర్మెట్ట ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** బీజేపీ మండల అధ్యక్షులు ధారవత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పాలతో పాలాభిషేకం చేసి పూలమాల వేసి బిజెపి భీం దీక్ష చేపట్టడం జరిగింది. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇలా మతిభ్రమించి మాట్లాడితే తెలంగాణ ప్రాంతంలో ఏ గ్రామంలో కూడా తెరాస కార్యకర్తలు కానీ నాయకులు కానీ తిరగకుండా దళిత గిరిజనులు తరమి కొడతారు జాగ్రత్త అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కిసాన్మోర్చా కార్యదర్శి బైరగోని ఆంజనేయులు, బిజెపి నర్మెట మండల అధికార ప్రతినిధి వాసుదేవ రెడ్డి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి, నాగభూషణం శర్మ, మండల కార్యదర్శులు ధరావత్ వినోద్ కుమార్, గంగం ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు పోలు రాజు, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిలు రంజిత్, రాజు గిరిజన మోర్చా కార్యదర్శి కిషోర్, శంకరయ్య, ఎల్లయ్య, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.





## దుర్గాభవానీ అమ్మవారిని దర్శించుకున్న కార్పోరేటర్లు

**కరీంనగర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** మాఘమాసం సందర్భంగా కరీంనగర్ మండలం నగునూర్ లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో జరుగుతున్న శైశిర నవరాత్రోత్సవాలలో భాగంగా గురువారం కరీంనగర్ నగర పాలక సంస్థ డిప్యూటి మేయర్ చల్లా స్వరూపరాణి, కార్పోరేటర్లు వంగళ శ్రీదేవి, గుగ్గిళ్లపు శ్రీదేవి, లెక్కల స్వప్న, గంట కల్యాణి, సుదగొని మాధవి, టిఆర్ఎస్ నాయకురాలు గందె కల్పన, ఆదరణ ఎన్జీవో అధ్యక్షురాలు కర్రె పావనీలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారులు వారికి అమ్మవారి ప్రసాధం అందజేయగా ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగళ లక్ష్మణ్ దంపతులు వారిని శాలువాలతో సత్కారించారు.



## లింగాల ఘనపూర్‌లో కేసీఆర్ శవయాత్ర

### దిష్టిబొమ్మ దహనం



**జనగామ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగాన్ని అవమానించిన సిఎం కేసీఆర్ నియంతృత్వ, నిరంకుశ, రాచరిక దొరల పాలనకు రాజ్యాంగమే అడ్డు వస్తుందని గ్రహించి అధికార అహంకార మత్తులో రాజ్యాంగాన్ని మార్చాలంటూ వ్యాఖ్యలు చేయడం హేయమైనదని ఎం.ఎస్.ఎఫ్ రాష్ట్ర నాయకులు రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎం.ఎస్.ఎఫ్ (స్టే) ఘనపూర్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సందేన రవీందర్ మాదిగ హెచ్చరించారు. లింగాల ఘనపూర్ మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు భారత రాజ్యాంగం పట్ల కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఎం.ఎస్.పి, ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.ఎఫ్, వి.హెచ్.ఎస్ అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో నల్ల జెండాలతో కేసీఆర్ శవయాత్ర చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేద్కర్ అన్నా, రాజ్యాంగం అన్నా ప్రాణంతో సమానమని, దాని జోలికొస్తే సహించేది లేదని అన్నారు. పౌర హక్కుల్ని హరించేలా అధికార అహంతో వ్యాఖ్యలు చేయడం దొర దురహంకారానికి నిదర్శనమని మండి పడ్డారు. భారత రాజ్యాంగమే పరిపాలనా వ్యవస్థకు, పౌర హక్కులకి దేశ మానవాళి మనుగడకు జీవనాధారమని గుర్తు చేశారు. రాజ్యాంగం అందరి ప్రతీకని దానికోసం అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా పోరాడాలని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగానే హీడన్ ఎజెండాలోనే కేసీఆర్ ఈవాఖ్యాలు చేశారని రాజ్యాంగాన్ని అవమానిస్తు హక్కుల్ని హరిస్తుంటే చూస్తూ ఊరుకునేందుకు సిద్ధంగా లేమని హెచ్చరించారు. కేసీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పేదాక యుద్ధభూమిలో నిలబడి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ రక్షణకు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎంతటి వరకైనా పోరాడేందుకు సిద్ధమేనని, కుట్రలు చేయాలని చూస్తే కేసీఆర్ నిన్ను రాజకీయంగా బొంద పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వి.హెచ్ పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం అంజయ్య, ఎం.ఎస్.పి నాయకులు ప్యాట ముత్తయ్య మాదిగ, గట్టగళ్ల విష్ణు మాదిగ, ఎం.ఆర్.పి.ఎస్ అధ్యక్షులు మేడ శ్రీనివాస్ మాదిగ, విహెచ్.పి.ఎస్. మండల కన్వీనర్ గడ్డం సోమారాజ్, కుంటి వెంకటయ్య, ఆముదాల స్వామి, మెంటేన కిష్టయ్య, ఎం.ఎస్. ఎఫ్ మండల నాయకులు బర్రె మల్లేష్ మాదిగ, కుంటి యాకన్న, గట్టగళ్ల బాబు మాదిగ, గ్రామ కమిటీ నేతలు ప్యాట కార్తిక్, బంధారపు కరుణాకర్, ప్యాట భాస్కర్, బర్రె కరుణాకర్, ప్యాట నరేష్, రవి, గట్టగళ్ల నర్సయ్య, తుడి వెంకటేష్, మేడ తిరుమలయ్య, పవన్, రాజు, అజయ్ మహేందర్, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణలో రక్తదాన శిబిరం

**జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణలో పట్టణ వైశ్యసంఘం సభ్యులతో స్థానిక వైశ్యభవనములో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరం సందర్భంగా పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, బొడ్ల జగదీష్, కొమురవెల్లి వేణు గోపాల్, సంఘం గౌరవ అధ్యక్షుడు ఎరవెల్లి సురేష్, ప్రధాన కార్యదర్శి పబ్బ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాచకొండ నరేందర్, మున్సిపల్ వైస్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, ఎస్ సి, ఎస్ టి జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యులు టివి సూర్యం, వైశ్యసంఘం నాయకులు చకినం కిషన్, దేవరశెట్టి జనార్దన్, బట్టు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైశ్య సంఘ సభ్యులు 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా కొండూరి సుమ లత రజనీకాంత్ స్పందించి మొదటిసారిగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సుమలత రక్తదానం పట్ల స్పందిస్తూ రక్తదానం పట్ల అపోహలు అవసరం లేదనీ, మహిళలైనా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు...ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో మొదటి సారిగా ఎలాంటి భయం, అపోహలు లేకుండా రక్తదానం చేయడానికి ముందుకు రావడం జరిగిందన్నారు. ఈ విషయంలో మహిళలు కూడా ముందుకు వచ్చి ప్రోత్సాహం అందించాలనీ, రక్తదానం ఎన్నో ప్రాణాల్ని కాపాడుతుందనీ అది తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పుకొచ్చింది.

## చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

### బిజెపి జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్

**కరీంనగర్ ఫిబ్రవరి 03( ప్రజామంటలు):** కరీంనగర్ నగరం రోడ్లపైన చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు నగరపాలక సంస్థ చేయకుండా వ్యాపారులను రోడ్లపై నుండి ఖాళీ చేపిస్తే జీవించడం ఎలా అని బిజెపి జిల్లా కార్యదర్శి మరియు ఎస్టి మోర్చా ఇంచార్జి రాపర్తి ప్రసాద్ అన్నారు. గురువారం రోజున చిరు వ్యాపారుల తో కలిసి కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కరీంనగర్ నగర పాలక సంస్థ సిబ్బంది అతి ఉత్సాహం తో ఎన్నో కుటుంబాలు ఫుట్ పాత్ పైన చిరు వ్యాపారం చేసుకుంటూ జీవన ఉపాధి కొనసాగిస్తున్నావారి కుటుంబాలు బతుకుతున్నాయి అని కానీ రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సిబ్బంది మరియు పోలీసులు కలిసి చిరు వ్యాపారులను వ్యాపారాలు చేసుకోకుండా బండ్ల పైన ఉన్న సామాను పండ్లు తీసుకెళ్తున్నారని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా సమీకృత మార్కెట్లు నిర్మించకుండా అధికారులు ఏం చేస్తున్నారు, మిగీతా పట్టణాలలో సమీకృత మార్కెట్ నిర్మాణం జరుగుతుంటే మరి కరీంనగర్లో అధికారులు ఏం చేస్తున్నారు, కనీసం సమీకృత మార్కెట్ల నిర్మాణానికి స్థల సేకరణ కూడా చేయలేదు నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసేది అన్నడు. ప్రభుత్వ అధికారుల ఒంటెద్దు పోకడతో చిరు వ్యాపారులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఇది చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు తీరిన వెంటనే



మార్చుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఒకరు చేసిన తప్పుకు ఇంకెవరన్నా బలి చేస్తున్నారు. వ్యాపారాలు బంద్ చూపిస్తున్నారని దానివల్ల అనేక కుటుంబాలు రోడ్ల మీద పడుతున్నాయని ఇప్పటికైనా చిరు వ్యాపారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, స్థానిక ప్రాంతాల వారీగా ప్రధాన కూడళ్లకు సమీపంలో లో మార్కెట్ నిర్మాణాలు వెంటనే ఏర్పాటు చేసి ఇ చిరు వ్యాపారులను ఆదుకోవాలని రాపర్తి ప్రసాద్ నగరపాలక సిబ్బందిని కోరారు. ఆదుకోని ఎడల చాలా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా వారు కరీంనగర్ నగర పాలక సంస్థ అధికారులను హెచ్చరించారు.

## కె.సి.ఆర్. దిష్టిబొమ్మ దగ్ధం : కాంగ్రెస్ శ్రేణుల అరెస్ట్

**జనగామ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలోని అంబెడ్కర్ విగ్రహం ముందు జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం టీపీసీసీ మాజీ అధ్యక్షులు



పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు రాజ్యాంగం మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కె.సి.ఆర్. దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దిష్టిబొమ్మను దగ్నం చేసిన వారిని అరెస్ట్ చేసి జనగామ పోలీసు స్టేషన్ తరలించారు.

అనంతరం జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ చెంచా రపు శ్రీనివాస్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరా, జిల్లా నాయకులు ఉడత రవి యాదవ్, పిఎసిఎస్ డైరెక్టర్ వడ్లకొండ వంగల మల్లారెడ్డి మాట్లాడుతూ....రాజ్యాంగం కలిపించిన ఓటు హక్కుతో అధికారంలోకి వచ్చిన కె.సి.ఆర్ అధికార మదంతో ఏమి మాట్లాడుకున్నాడో కూడా తెలియడం లేదని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ రాసిన రాజ్యాంగ రచనలను కేసీఆర్ తప్పు పట్టి కొత్త రాజ్యాంగం కావాలని విజ్ఞప్తి చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆప్షన్ లో సంఘం మాజీ వైస్ ప్రెసిడెంట్ కట్ట కృష్ణ, జిల్లా నాయకులు అల్లం ప్రదీప్ రెడ్డి, పట్టూరి శ్రీనివాస్, బడికె కృష్ణ స్వామి, ఎన్.ఎస్.యు.ఐ. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చందనరెడ్డి, జనగామ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజిద్, ఆకుల లక్ష్మయ్య, బండారు శ్రీనివాస్, మాజిద్ మీర్జా, జనగామ నియోజక వర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ ఫయాజ్, పొన్నాల యువ సేన జనగామ పట్టణ అధ్యక్షుడు కందుల రాజు, చింతకింది నరేష్, పులిగిల్ల శివ యాదవ్, కసాని విజయ్, బెజడి హరీష్, సందీప్ పాల్గొన్నారు.

## సీఎం వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు నిరసన

**రాయికల్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ రాజ్యాంగాన్ని మార్చాలని వివాదాస్పద వ్యాఖ్యలు



చేసినందుకు నిరసనగా భూపతిపూర్ లో అంబేద్కర్ గారి విగ్రహం ముందు ప్లకార్డులతో నిరసన తెలిపిన బీజేపీ నాయకులు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూపతిపూర్ ఉపసర్పంచ్ అన్నవేణి వేణు మాట్లాడుతూ.... ఒక రాష్ట్రానికి సీఎం అయి ఉండి భారత జాతిని అవ మానించే విధంగా రాజ్యాంగాన్ని మార్చాలనడం చూస్తుంటే సీఎం మానసిక స్థితి సరిగా లేదు అని అనుమానం వస్తుంది అని, తెరాస కార్యకర్తలు నాయకులు అహంకారంతో మాట్లాడుతున్నారు. అని ఇకనైనా దీనికి క్షమాపణ తెలపాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లు ఆకుల మహేష్, తిప్పిరెడ్డి రాజశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు సంకోజి శేఖర్, గ్రామ కార్యకర్తలు కేజీ రామ్, చందా అంజయ్య, భోగ భూమయ్య, మగ్గిడి వినోద్, సురేందర్, ఎల్లల రాజేష్, జీకురి ఆనంద్, జీకురి శేఖర్, కొమ్ము మధు, బుర్రి సంతోష్, రొట్ల నరేష్, కట్టా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా కేంద్రానికి ఉప్పల్ క్రాస్ రోడ్ నుండి హన్మకొండ వరకు సింగిల్ బస్టాప్ తో నూతన బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని త్వరలో ప్రారంభించనున్నట్లు టీస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారన్న సాదిక్ ఫౌండేషన్ అధ్యక్షులు సాదిక్ అలీ

## నేటి నుండే బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు

### సర్వాంగసుందరంగా ప్రధాన కూడళ్లు, ఆకట్టుకుంటున్న స్వాగతతోరణాలు

**కరీంనగర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** కరీంనగర్ నడిబొడ్డున స్వయంభూ శ్రీ వేంకటేశ్వరుడిగా విరాజిల్లుతున్న బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుంచి 13 వరకు ఘనంగా జరగనున్నాయి. ఐదవ పంచమ వార్షిక బ్రహ్మోత్సవమును వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం పండితులు శ్రీనివాసచార్యుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణ చార్యులు, అనువంశిక అర్చకులు చేన్నోజ్వల నారరాజా చార్యుల నిర్వహణలో ఘనంగా నిర్వహించునున్నారు. దేవాలయాన్నిసర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద దేవతామూర్తుల నమునాలతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.





తరిగొప్పుల మండల కేంద్రంలోని గ్రామంలో సిసి రోడ్లు ప్రారంభించిన తెలంగాణ ఎక్స్ సీడ్స్ డైరెక్టర్ అర్జుల సంపత్ రెడ్డి. 5 లక్షల రూపాయల నిధులు విడుదల చేసిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి. పాల్గొన్న ఉపసర్పంచ్ భాషబోయిన రాజు తుపాకుల తిరుమలేష్, మూల మహేష్, రైతు కోఆర్డినేటర్ మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లింగం, సంపత్ రెడ్డి, శ్రీ నివాస్, తుపాకుల సత్తయ్య, పెల్లి సంపత్, తదితరులు

## ఉరి వేసుకుని ఆత్మహత్య

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** నిజామాబాద్ పట్టణానికి చెందిన వడియాల సునీల్ రెడ్డి వయసు 51 సంవత్సరాలు, సిఈఓ, ఫాక్స్ జన్నపల్లి నందు పని చేసే వ్యక్తి, వ్యక్తిగత కారణాలతో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయి, బండలింగాపూర్ గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని మేనమామ సంజీవ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్.ఐ. ఆర్. ఉమ సాగర్ తెలిపినారు.



## టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షునికి అభినందనలు తెలిపిన జిల్లా సెర్ప్ ఉద్యోగులు

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా జిల్లా కోరుట్ల శాసన సభ్యులు కే. విద్యాసాగర్ రావు ను మెట్ పల్లి లో వారి నివాసంలో టి.సెర్ప్ ఉద్యోగులు కలిసి వారికి అభినందనలు తెలపడం జరిగినది. ఈ సందర్భంగా సెర్ప్ సిబ్బంది వారి సమస్యలకు సంబంధించి గత అసె%శీ%బ్లీ



ఎన్నికల మేనిఫెస్టో లో మరియు శాసన సభలో గౌరవ ముఖ్యమంత్రి వర్యులు సెర్ప్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు పరచవలసినిదిగా వినతిపత్రం ఇవ్వడం జరిగినది. జిల్లాలోని ఆయా మండలాల ఏపిఎం లు ఏ.శంకర్, డి. విమోచన, ఏ.ఏ.ఆర్. శంకర్, రాజేష్, వి. గంగాధర్, జి.అశోక్, సి సి లు సురేఖ, లక్షన్, రాజు, రాజశ్రీ, అశోక్, పురుషోత్తం పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## ముత్తారం త్రికుటేశ్వర ఆలయంలో అక్షరాభ్యాసం

### సరస్వతీ ఆలయ నిర్మాణంకు భూమి పూజ

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారంలోని త్రికుటేశ్వర ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమం వసంతపంచమి రోజున నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఏనుగు రాంరెడ్డి, సతీష్ లు తెలిపారు. అనంతరం సరస్వతి ఆలయ భూమి పూజ ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.




ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ శ్రీ శ్రీ రాజయోగి సిద్దేశ్వర మహారాజ్ హాజరవుతున్నట్లు తెలిపారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అక్షరాభ్యాస కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# తరిగొప్పులలో బిజెపి భీమ్ దీక్ష

**తరిగొప్పుల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** బీజేపీ పార్టీ ఆదేశానుసారం అదేవిధంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆరుట్ల దశమంత్ రెడ్డి పిలుపు మేరకు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు బిజెపి మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బిజెపి భీమ్ దీక్షా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పబ్బోజు రామ్ బ్రహ్మచారి కిసాన్మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఏడెల్లి రామ్ నర్సింహ రెడ్డి, ఉపాధ్యక్షులు తలకొక్కుల శ్రీనివాస్, కొన్నె రోజు, గంధం ఎల్లయ్య, గిరిజన మోర్చ మండల అధ్యక్షుడు రాజునాయక్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు కావటి రాజుముదిరాజ్, గిరిజన మోర్చ నాయకులు గూగుల్ ప్రవీణ్ నాయక్, అల్పతి నాయక్, సుధాకర్, పొగుల, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ వాఖ్యలు దురహంకారానికి పరాకాష్ట

### పిసిసి అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం

**చొప్పదండి ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** కెసిఆర్ భారత రాజ్యాంగంపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా చొప్పదండి మండల కేంద్రంలో టిపిసిసి అధికార ప్రతినిధి, చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించి అంబేద్కర్ విగ్రహం ముందు కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అంబేద్కర్ ఎంతో ముందు చూపుతో అణగారిన ప్రజల అభ్యున్నతికి,



గొప్ప రాజ్యాంగాన్ని తయారు చేసి భారతదేశానికి అందిస్తే, అదే రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై రాజ్యాంగాన్నే మార్చాలని మాట్లాడటం కెసిఆర్ అహంకారానికి పరాకాష్ట అని అన్నారు. కెసిఆర్ నియంతృత్వ పోకడలకు అనుగుణంగా లేదని రాజ్యాంగాన్ని మార్చాలని అనడం ఆయన మూర?త్వానికి పరాకాష్ట అన్నారు. వెంటనే ఆయన మాటలు వెనుకకు తీసుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు ఉధృతం చేస్తామన్నారు.

## కేసీఆరూ... రాజ్యాంగాన్ని కాదు.... నిన్ను మార్చాలి ముందు....

### - బీజేపీ నేతల భీమ్ దీక్ష

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** రాజ్యాంగాన్ని కాదు..ముందు సీఎం పదవి నుంచి నిన్ను మార్చాలని...డిమాండ్ చేస్తూ బన్సీలాల్ పేట డివిజన్ బీజేపీ నేతలు ఆందోళన నిర్వహించారు. గురువారం పద్మారావునగర్ లోని రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన బీజేపీ నాయకులు, అనంతరం అక్కడనే భీమ్ దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం వలనే వచ్చిన తెలంగాణ లో



ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన కేసీఆర్ ఈ రోజు ఏరు దాటాకా తెప్ప తగలేసినట్లు.. ఇప్పుడు ఏకంగా రాజ్యాంగాన్నే మార్చాలని డిమాండ్ చేయడం మూర్కత్వమన్నారు. ఇక తమ ప్రభుత్వ పని అయిపోతుందని తెలుసుకున్న కేసీఆర్ ఫ్రస్టేషన్ లో పిచ్చి కూతలు కూస్తున్నాడని వారు ఎద్దేవా చేశారు. దీక్షలో సికింద్రాబాద్ లోక్సభ ఇంచార్జీ తడిసిన రాజశేఖర్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ ఉమేశ్ ఖండేల్వాల్, నాయకులు గుండు కృష్ణ, వై. సురేశ్, ఏ.సదానంద్, శివలింగం, కుర్మ శంకర్, బి.లక్ష్మన్, ప్రవీణ్, నర్సమ్మ, రవి టెంగిల్కర్, ఎం.శ్రీనివాస్, కృష్ణ, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన

**జగిత్యాల రూరల్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** నూకపల్లి లోని న్యాక్ ఇన్స్టిట్యూట్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గంజాయి మరియు డ్రగ్స్ యొక్క దుష్ప్రభావాల గురించి ఎక్సైజ్ శాఖ తరపున అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ



కార్యక్రమంలో జగిత్యాల ఎక్సైజ్ సీఐ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.... గంజాయి, డ్రగ్స్ కి యువత బానిస కావద్దని, ఒక్కసారి అలవాటు పడితే మానడం కష్టం అని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేసినా, అమ్మినా, సేవించిన కఠిన చర్యలు తీసు కుంటామని, అలాంటి వారి వివరాలు తెలిపి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ లు భాస్కరరావు, నరేష్ రెడ్డి, సిబ్బంది మరియు న్యాక్ ఇన్స్టిట్యూట్ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి

**రాయికల్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపాలిటీ ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మాండ్లు గురువారం కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ఈ రెండు



సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి పనులపై రూపొందించిన పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హన్మాండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్ లు తురగ శ్రీధర్ రెడ్డి, మహేందర్, కోఆప్షన్ సోహైల్, టౌన్ యూత్ అధ్యక్షులు రాంమూర్తి పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ రమణను సత్కరించిన బీసీ నాయకులు

**జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ ఎల్. రమణ ను సన్మానించారు. ఈ సందర్భంగా



జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాజుల నాగరాజు మాట్లాడుతూ....వెనుకబడిన తరగతుల బడుగు బలహీన వర్గానికి చెందిన రమణ ఎమ్మెల్సీగా అత్యధిక మెజారిటీతో ఎన్నికై నూతనంగా జగిత్యాలలో బడుగుల యొక్క ఆశాదీపం గా నిలిచారు. మరియు వారు ఈ ప్రాంతాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేస్తారని బడుగుల యొక్క సమస్యలను పరిష్కరిస్తానని, ఈ ప్రాంత సమస్యలన్నీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గాజుల నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరుగంటి భార్గవ్ రామ్, ఆకుల నాగ రాజు, సిరిపురం మహేందర్, క్యాదాసు నాగయ్య, ముత్యాల స్వామి, ఓరుగంటి పెద్దిరాజు, గంగిపల్లి వేణుమాధవ్, బాలె వరుణ్, గట్ల శ్రీకాంత్, గట్ల శ్రీనివాస్, గట్ల శ్రీకర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని అవమానించిన కెసిఆర్‌కు పాలించే హక్కులేదు

### కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడిన ముఖ్యమంత్రి కేసీఆర్



కు పాలన చేసే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ శంకర్, గాజుల రాజేందర్ లు అన్నారు. రాజ్యాంగం ద్వారానే తెలంగాణ ఏర్పాటు జరిగిందని సీఎం కేసీఆర్ మరిచిపోయారా? అని వారు ప్రశ్నించారు. గురువారం జగిత్యాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగాన్ని కించపరుస్తు కెసిఆర్ చేసిన వాక్యలను నిరసిస్తూ బాబాసాహెబ్ అంభేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మలిన పరిచిన ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి అంభేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శంకర్, రాజేందర్ లు మాట్లాడుతూ.... రాజ్యాంగాన్ని అవమానపరిచిన ప్రజలను పాలించే హక్కు కెసిఆర్ లేదని తెలిపారు. రాజ్యాంగాన్ని అవమానపరిచిన సిఎం కు తెలంగాణ ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేకుంటే కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రజలే గద్దెదించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండ భాస్కర్ రెడ్డి, అల్లాల రమేష్ రావు, ధర రమేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యకులు గుండా మధు, బాపురెడ్డి, తోట నరేశ్, కౌన్సిలర్ నక్క జీవన్, నాయకులు, విద్యార్థి నాయకులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జాంబాగ్‌లో రేషన్ షాపును తనిఖీ చేసిన మున్సిపల్ ఛైర్పర్సన్ శ్రావణి

**జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** ప్రజా పంపిణి వ్యవస్థ ద్వార తెల్ల రేషన్ కార్డుధారులకు అందిస్తున్న నిత్యావసర వస్తువులను సక్రమంగా అందించాలని జగిత్యాల



మున్సిపల్ ఛైర్పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్ డీలర్లకు సూచించారు. గురువారం జగిత్యాల పట్టణ%శీ%లోని 17వ వార్డులో గల బైపాస్ రోడ్డు జాంబగ్ వద్ద రేషన్ షాప్ ని మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణి కౌన్సిలర్లతో కలిసి తనీఖీ చేశారు. ఈ సంధర్భంగా ఛైర్పర్సన్ శ్రావణి మాట్లాడుతూ.... రేషన్ షాపుల ద్వార ప్రభుత్వం రుపాయికే కిలో బియ్యాన్ని అందిస్తుందని పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

రేషన్ షాపులకు కెటాయించబడ్డ సరుకులను కార్డు దారులకు ఓపికతో, సమయపాలన పాటిస్తూ అందరికి అందేలా చుడాలన్నారు. ఇపుడున్న కొవీడ్ పరిస్థితుల ధృష్ట్యా కొన్ని నెలలు సరుకులను ప్రభుత్వం ఉచితంగా అంధింస్థుంధని, కార్డుదారులు సరుకులు అడిగి తీసుకొవాలన్నారు. రేషన్ షాపుల్లో అక్రమాలను సహిం చెధిలెధని, అటువంటి వారిపై చర్యలకొసం సంబంధిత అధికారులకు సిపారసు చేస్తామని శ్రావణి హెచ్చరించారు. వెంట కౌన్సిలర్లు సిరికొండ పద్మ సింగరావ్, చుక్క నవీన్ తదితరులున్నారు.

## కెసిఆర్ వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి జై భీమ్ దీక్ష

**జనగామ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** భారతీయ జనతాపార్టీ జనగామ జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సిఎం కేసీఆర్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను అవమానించే విధంగా రాజ్యాంగాన్ని



మార్చాలని సంబోధించడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని చౌరస్తాలో గురువారం జై భీమ్ దీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆరుట్ల దశమంత రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చాలంటే బిఆర్ అంబేద్కర్ ను దళిత సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. మొదటి నుంచి టిఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ఆధారంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని, నేడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగు తున్నారని గుర్తు చేశారు. అలాంటి రాజ్యాంగాన్ని గౌరవించని ముఖ్యమంత్రికి ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్ ,ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్ల శ్రీనివాస్, బిజెపి జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, జనగామ పట్టణ అధ్యక్షులు పవన్ శర్మ, జనగామ మండల అధ్యక్షులు బండారి తిరుపతి, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు దేవర ఎల్లయ్య, గండి నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి సందీప్, సంపత్, మహేష్, క్రాంతి పాల్గొన్నారు.

# తెలంగాణ 'రాష్ట్ర రాబందు' బండి సంజయ్

### కథలాపూర్ మండల నాయకులు

**కథలాపూర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర రాబందు బండి సంజయ్ అని కథలాపూర్ మండల టీఆరెఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ బీజేపీ నాయకులు నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు అని ఎద్దేవా చేశారు. ఎంపీగా బండి సంజయ్ గెలిచినా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామని నమ్మబలికిన ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి రోడ్డున పడేసిన ఘనత బిజెపి ప్రభుత్వానిది అని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న టీఆరెఎస్ ప్రభుత్వం పై బిజెపి ఎప్పుడు బురద చల్లే ప్రయత్నమే మిలియన్ మార్చ్ అని దేశాన్ని అమ్ముడుపాలు చేస్తున్నబిజెపి పై ఢిల్లీలో మిలియన్ మార్చ్ చేయాలన్నారు. సోషల్ మీడియాలో రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి దొంగ



ప్రచారాలు చేస్తున్నారన్నారు. యువతకు మత రాజకీయాల ఉసి గొల్పడం ఇకనైనా మానుకోవాలని హితువు పలికారు. జడ్పీటీసీ నాగం భూమయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ వర్ధినేని నాగేశ్వరరావు,వైస్ ఎంపీపీ కిరణ్ రావు, కో ఆప్షన్ రఫీ, మండల అధ్యక్షులు గడిలా గంగా ప్రసాద్, రుద్ర%శీ%గి జడ్పీటీసీ గట్ల మీనయ్య, రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూప మహేష్, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, విద్యార్థి నాయకులు, అన్ని గ్రామాల టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## కెసిఆర్ వ్యాఖ్యలపై స్టేషన్‌ఘన్‌పూర్ లో బి.ఎస్.పి. నిరసన

**జనగామ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** బహుజన్ సమాజ్ పార్టీ జనగామ జిల్లా అధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్



నియోజకవర్గ కేంద్రంలో కేసీఆర్ భారత రాజ్యాంగం పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసన అధ్యక్షులు టివి స్వామి స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ అధ్యక్షులు ఆకారపు దేవన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాబోయే ఎన్నికలలో కేసీఆర్ ప్రభుత్వాన్ని కూల్చాలని, వత్తాసు పలికే ఎమ్మెల్యేలను తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెపుతారని అన్నారు. ఇలాంటి దుర్మరణమైన పాలన ఇక సహించేది లేదని అన్నారు. బహు జనులు సంఘటితం కావాలని, రాజ్యాధి కారం సాధించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్య క్షులు తాటికొండ కుమార స్వామి, స్టేషన్ ఘనపూర్ మండల కన్వీనర్ బాస్కుల మున్నా, వేలేరు మండల కన్వీనర్ ఎం. చక్రపాణి, ఖిలాషా పూర్ బీఎస్పీ నాయకులు జీలుకర దివాకర్, మస్సి అనిల్.చాగల్ గ్రామ కోశాధికారి క్రాంతి కుమార్, స్వేరోస్ ఇంటర్నేషల్ జనగాం అధ్యక్షులు చాడ వెంకటస్వామి, బీఎస్పీ నాయకులు తాళ్లపల్లి దేవదానం, పైసా శ్రీకాంత్, సంపత్, రవి పాల్గొన్నారు.

నెల్లుట్ల సునీత రూపొందించిన సాహితీ బృందావన జాతీయ వేదిక ద్వితీయ వార్షికోత్సవంలో సున్నితాలు సృజించిన జనగామకు చెందిన రచయిత్రి బుదారపు లావణ్యకు సాహితీ విభూషణ అవార్డు ప్రధానం




# జగిత్యాల ఖిల్లాను పర్యాటక కేంద్రముగా అభివృద్ధి చేస్తాం

### మున్సిపల్ చేర్ పర్సన్ డా. బోగ శ్రావణి

**జగిత్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణములోని ఖిల్లాను చేర్పర్సన్ డా. భోగ శ్రావణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఖిల్లాను పర్యాటక కేంద్రముగా అభివృద్ధి పరచుటకు నివేదిక తయారు చేయాలనీ తదనుగునముగా పనులు చేపట్టాలని, ఖిల్లాలో మొక్కలను నాటించాలని మరియు మొక్కల సంరక్షణకు డ్రిప్ సిస్టం ఏర్పాటు చేయాలనీ అధికారులను ఆదేశించారు. వీరి వెంట నాయకులు సుల్తాన్ అహ్మద్, ముఖీమ్,



దూమల రాజ్ కుమార్, రిజ్వాన్, డి.ఈ రాజేశ్వర్, ఏ.ఈ శరణ్ తేజ, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల యెల్లం, హరిత హారం కొఆర్డినేటర్స్ రాంబాబు, స్రవంతి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**కొడిమ్యాల ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలోని అంగడి బజార్లో 25 లక్షలతో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం కొరకు





గురువారం చొప్పదండి శాసనసభ్యులు సుంకె రవి శంకర్ భూమి పూజ చేశారు. అలాగే ఎంపిటిసి 3 పరిధిలో గౌడ్ సంఘం పక్కన డ్రైనేజీ నిర్మాణం పనులను మండల పరిషత్ నిధులనుండి రెండు లక్షల రూపాయలతో నిర్మించడానికి కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ చేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్. గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్. సర్పంచ్ ఏలేటి మమత నరసింహారెడ్డి, ఎంపీపీ స్వర్ణలత జెడ్పిటిసి ప్రశాంతి సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కృష్ణారావు సింగిల్విండో చైర్మన్ రాజ నర్సింగ్ రావు వైస్ ఎంపీపీ పర్లపల్లి ప్రసాద్ ఎంపీటీసీ లు జమాల్పూర్ రాజేశ్వరి రాజేందర్, సామల లక్ష్మణ్, స్థానిక వార్డు మెంబర్లు టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేష్, మండలంలోని స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యాలపై అవగాహన

**రాయికల్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని భూపతిపూర్ గ్రామ పంచాయితి ఆవరణలో గురువారం ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ వంగ గీత రెడ్డి జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చదువుతో పాటుగా వృత్తి నైపుణ్యాలు కలిగి ఉన్నపుడే ఆర్థిక పురోగతిని సాధించవచ్చని, చదువుతో పాటుగా ఇష్టమైన పనిలో నైపుణ్యాన్ని సాధించాలని



ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో రాయికల్ చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ, అసిస్టెంట్ ఎలక్ట్రిషన్, బైక్ మెకానిక్, నాగారం శిక్షణా కేంద్రంలో బెడ్ సైడ్ నర్సింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రిషన్ కోర్సులు, మెట్పల్లి శిక్షణ కేంద్రాల్లో బ్యాంకింగ్,ఏసీ, సోలార్ టెక్నీషన్, రీటైల్ సేల్స్, అసిస్టెంట్ వంటి పలు కోర్సుల్లో ఉచిత హాస్టల్ సౌకర్యంతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత ఉపాధి శిక్షణ వివరాలకోసం ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి చరవాణి 9963347142 నెంబర్ యందు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, వైస్ ఎంపిపి యాచమనేని మహేశ్వర్ రావు, ఉపసర్పంచ్ అన్నవేణి వేణు, వి.ఓ లత వార్డు సభ్యులు, ఆర్గనైజర్లు వర్దిని, విజయ, శ్యామల యువతీ, యువకులు పాల్గొన్నారు.

## వర్తక సంఘ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**జన్నారం ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** జన్నారం మండల కేంద్రంలోని వికాస్ కళాశాల సమీపంలో సంఘం ఆధ్వర్యంలో వర్తక సంఘం నూతన భవనం నిర్మించారు.గురువారం రోజు వర్తక సంఘం భవనాన్ని ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవం లో ఎమ్మెల్యే రేఖాశ్యామ్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... వైశ్యులు అన్ని రంగాలలో రాణించాలని, దాన ధర్మలలో వైశ్యులు ముందుంటారని అన్నారు. వర్తక సంఘం భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన బండారు మారుతి రాజు, రాధాకృష్ణ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్షెటిపేట మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, చెట్ల రమేష్, జడ్పీటీసీ ఎర్ర చంద్ర శేఖర్, పోనకల్ సర్పంచ్ జక్కు భూమేష్, ఎంపీపీ సరోజన వర్తక సంఘం అధ్యక్షుడు మారుతి రాజు, ప్రధాన కార్యదర్శి గుండ సుధాకర్,కోశాధికారి జక్కు



రమేష్, నాయకులు చెర్మెన్ శీలం రమేష్, గొట్లా రాజేష్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, భారత్, నర్సాగౌడ్ తదితరులు తెరాస నాయకులు పాల్గొన్నారు.



జగిత్యాల పట్టణ బైపాస్ రోడ్డు 17వ వార్డు మైసమ్మ గడ్డ వద్ద నూతన "ఆయుర్ కేర్ ఆయుర్వేద కన్సల్టేషన్ సెంటర్"ని ప్రారంభించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ ఛైర్పర్సన్ డా.భోగ శ్రావణి. వారి వెంట కౌన్సిలర్లు సిరికొండ పద్మ సింగ రావ్, చుక్క నవీన్, నాయకులు డిష్ జగన్, కశెట్టి తిరుపతి తదితరులు ఉన్నారు.

## రాజ్యాంగం మార్చాలని అనడం దేశ ప్రజలను అవమానించడమే

### మ్యాన మహేష్

**ఖానాపూర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** భారతీయులందరికీ శిరోధార్యం ఐన రాజ్యాంగమును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు మార్చాలని అనడం దేశ ప్రజలను అవమానించడమేనని బిజెపి రాష్ట్ర నాయకులు మ్యాన మహేష్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో జరిగిన జై భీమ్ దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి దీక్షలో పాల్గొన్నారు. రాజ్యాంగం మార్చాలన్న కెసిఆర్ వైఖరిని తాము తప్పు పడుతున్నామని ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత కెసిఆర్ కు లేదని అన్నారు. రాజ్యాంగం పై ప్రమాణం చేసి కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, అంతేకాకుండా తన కుటుంబ సభ్యులు రాజకీయ పదవుల లోకి రావడం రాజ్యాంగ చలువే అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పలుమార్లు కేసీఆర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల మేరకు చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు స్ఫూర్తిగానే తాను ఉద్యమంలో పాల్గొంటున్నానని చేసిన వ్యాఖ్యలు మర్చిపోయారా? అని ప్రశ్నించారు, సచివాలయాన్ని కూల్చి ప్రగతి భవన్ నుండి పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పెంబి జెడ్పిటిసి సభ్యురాలు జానకి,హరి నాయక్ పడాల రాజశేఖర్, ఖానాపూర్ వార్డు కౌన్సిలర్ సంతోష్ పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.





నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన జనగామ డివిజన్ ఫారెస్ట్ రేంజ్ అధికారి కొండల రెడ్డి ని మర్యాదపూర్వకముగా కలిసి సన్మానం చేసిన శాగ ధనప్రకాశ్ సుజనా పౌండేషన్, ఖిలాషాపురం పౌండర్ శాగ దేవరాజ్.

## మార్కండేయ జయంతి రోజునే క్యాలెండర్ ఆవిష్కరణ

**జనగామ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలోని కళ్లెం రోడ్డులో ఉన్న మార్కండేయ దేవాలయంలో పద్మశాలి యువజన సంఘం నాయకులు పిట్టల సతీష్, ఎనగందుల కృష్ణ, ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్



ను గురువారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా పోపా జనగామ పట్టణ గౌరవ అధ్యక్షుడు మచ్చ బాలనర్సయ్య, జనగామ పట్టణ భారత టిసి సొసైటీ అధ్యక్షుడు గుర్రం నాగరాజు, మార్కండేయ దేవాలయ ధర్మకర్త దోర్నాల వెంకటేశ్వర్లు, జనగామ జిల్లా పద్మశాలి సంఘము కోశాధికారి బోగ కైలాసం, మంగళపల్లి జనార్ధన్ పాల్గొని మాట్లాడుతూ.... మార్కండేయ జయంతి రోజున పద్మశాలి యువజన సంఘము రూపొందించిన ఆవిష్కరించామని అన్నారు. పద్మశాలి కులస్థులందరు ఐక్యమత్యంగా ఉండి రాజ్యాధికారం దిశగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్, మంగళంపల్లి రాజు, బిర్రు శ్రీనివాస్, కాముని ఆంజనేయులు, కుంచె సుప్రీమ్, పాము నర్సింహారావు, కూరపటి శ్రీనివాస్, బింగి నరసింహులు, మంచికట్ల రాజేష్, వంశి పాల్గొన్నారు.

## వంట కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

### కళ్యాడపు ఆగయ్య

**కరీంనగర్ ఫిబ్రవరి 03 (ప్రజామంటలు):** ప్రభుత్వ పాఠశాలల్లో వంట కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు కనిసవేతన అమలు చేయక పోవడం టి ఆర్ఎస్ ప్రభుత్వ అసమర్ధతకు ఓ నిదర్శనం అని తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ కరీంనగర్ నియోజకవర్గం కళ్యాడపు ఆగయ్య అన్నారు. ఆయన మాట్లాడుతూ.... ఏడేళ్లుగా కేవలం 1000.రూ మాత్రమే గౌరవవేతనమును మాత్రమే ఇస్తున్నారు ఈవేతనం మకుచాలడం లేదని చాలా రోజులుగా కార్మికులు సమ్మెచేస్తున్న ప్రభుత్వం పటించుకోవడంలేదు, కోడి గుడ్ల ధరలు పెరిగి, వంటకు కావలసిన సరుకులదరలు పెరిగి వారునష్టపోతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు, పెరిగిన గుడ్ల ధరలను, పెంచాలని, కనిసవేతనం రూ.10,000 ఇవ్వాలని, కరీంనగర్ లో కలెక్టరేట్ వద్ద దీక్ష చేస్తున్న శిబిరాన్ని కరీంనగర్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ నేటర్ కళ్యాడపు ఆగయ్య సందర్శించి వారి డిమాండ్లకు పూర్తి మద్దతు తెలియచేస్తూ, వాటిని అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కళ్యాడపు ఆగయ్యతో పాటు పార్టీ నాయకులు రొడ్డ శ్రీనివాస్, ఎర్రోజు హాయగ్రీవచారి, ఎస్. రాజేశం, వెలుముల లక్ష్మణ్ రావు, చేవురి నరసింహా చారి పాల్గొన్నారు.



హుజూరాబాద్ భీం దీక్షలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే ఈటల రాజేందర్



## తూర్పులో చెర్రీ చిత్ర షూటింగ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ప్రస్తుతం క్రియేటివ్ జీనియస్ శంకర్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియన్ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ తాజా షెడ్యూల్‌ను తూర్పుగోదావరి జిల్లాలలో మొదలుపెట్టబోతున్నట్టు సమాచారం. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకోగా ఆ షెడ్యూల్స్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్ అలాగే, సాంగ్



కంప్లీట్ చేశారట. ఇక కొత్తగా మొదలుపెట్టబోయే షెడ్యూల్‌లో టాకీ పార్ట్ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అయితే, తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఫిబ్రవరి 10 నుండి ఈ కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుందని సమాచారం. జిల్లాలతో చరణ్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. సుకుమార్ దర్శకత్వంలో వచ్చి భారీ హిట్ అయిన 'రంగస్థలం' సినిమాకు సంబంధించిన మెజారిటీ భాగం చిత్రీకరణ ఈ జిల్లాలో జరిగింది. అలాగే, మెగాస్టార్ – మెగా పవర్ స్టార్ కలిసి నటించిన 'ఆచార్య' కూడా అక్కడే పలు కీలక సన్నివేశాలను తెరకెక్కించారు. ఈ క్రమంలోనే ఇప్పుడు చిత్రీకరణ కూడా జరపబోతున్నట్టు తెలుస్తోంది. ఇందులో చరణ్ సరసన కియారా అద్వానీ జంటగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు – శిరీష్ కలిసి నిర్మిస్తున్నారు. 2023 సంక్రాంతికి విడుదల చేస్తామని నిర్మాత దిల్ రాజు ఇప్పటికే ప్రకటించారు.

## ముంబైలో ఇల్లు చూసుకుంటున్న రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఇటీవల విడుదలైన తన చిత్రం 'పుష్ప : ది రైజ్' విజయాన్ని ఆస్వాదిస్తోంది. ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన శ్రీవల్లి పాత్రను పోషించింది. అయితే ఇప్పుడు రష్మిక మందన్న కొత్త ఇంటికి మారుతున్నట్లు కనిపిస్తోంది. ఫిబ్రవరి 2న ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ లో సామాన్లను ప్యాక్ చేయడానికి చాలా కష్టపడుతున్నట్లు వెల్లడించింది. దీంతో రష్మిక మళ్లీ కొత్త ఇల్లు కొనుక్కుందా ? అని తెలుసుకోవడానికి చాలా మంది ఆసక్తిగా ఉన్నారు. ఫిబ్రవరి 2021లో రష్మిక మందన్న ముంబైలో కొత్త ఇంటిని కొనుగోలు చేసింది. ప్రస్తుతం రష్మిక మిషన్ మజ్ను, గుడ్‌బై అనే రెండు హిందీ చిత్రాలలో నటిస్తోంది. అయితే బాలీవుడ్ సినిమాల షూటింగ్ కోసం హోటల్స్‌లో బస చేయకుండా ముంబైలో



కొత్త ఇంటిని కొన్న రష్మిక ఇప్పుడు మళ్లీ ఇల్లు మారుతున్నట్లు కనిపిస్తోంది. ఆమె ఇప్పుడు 'పుష్ప : ది రూల్' షూటింగ్ కోసం సిద్ధమవుతోంది. ఇది మార్చిలో ప్రారంభమవుతుంది. సీక్వెల్ 2022 డిసెంబర్‌లో థియేటర్లలోకి రానుంది.

## 'ఆర్ఆర్ఆర్' సినిమా కొత్త పోస్టర్

తాజాగా 'ఆర్ఆర్ఆర్' సినిమా నుంచి గుఱ్ఱపు స్వారీ చేస్తూ రామరాజు, బులెట్‌పై భీమ్ ఉన్న కొత్త పోస్టర్‌ను రాజమౌళి బృందం విడుదల చేసింది. అంతేకాదు, నేటి నుంచి ఈ పాన్ ఇండియన్ సినిమా విడుదలకు 50 రోజులు ఉన్న విషయాన్ని తెలిపారు. రాజమౌళి దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోలుగా నటించిన 'ఆర్ఆర్ఆర్' పలు వాయిదాల తర్వాత ఫైనల్‌గా మార్చ్ 25న అత్యంత భారీ స్థాయిలో రిలీజ్ కానుంది.

ఈ నేపథ్యంలో మేకర్స్ మళ్ళీ ప్రమోషన్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా ఓ మేకింగ్ పిక్‌ను వదిలారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట చక్కర్లు కొడుతూ బాగా వైరల్ అవుతోంది. అల్లూరి సీతారామరాజుగా రామ్ చరణ్, కొమురం భీమ్ గా ఎన్టీఆర్ పవర్‌ఫుల్ పాత్రల్లో కనిపించబోతుండగా..అలియా భట్, ఒలివియా మోరిస్ హీరోయిన్స్‌గా..శ్రియ శరణ్, అజయ్ దేవగన్, సముద్ర ఖని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఎం.ఎం.కీరవాణి దీనికి సంగీత దర్శకుడు. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై దానయ్య భారీ బ్జడెట్‌తో నిర్మించారు.



## పఠాన్ సినిమాలో షారూఖ్ ఖాన్

'జీరో' మూవీ ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ కొద్ది రోజులు నటనకు దూరంగా ఉన్నాడు. అయితే ఇప్పుడు యశ్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్ లో సిద్దార్థ్ ఆనంద్ దర్శకత్వంలో కింగ్ ఖాన్ 'పఠాన్' మూవీ చేస్తున్నాడు. దీనితో పాటు షారుఖ్ ఖాన్.. ప్రముఖ దర్శకుడు రాజ్ కుమార్ హిరానీ మూవీకీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. ఈ సినిమా షూటింగ్ ఈ యేడాది మార్చిలో ముంబైలో మొదలవుతుందని తెలుస్తోంది. ఈ సినిమా కోసం ముంబై ఫిల్మ్ సిటీ స్టూడియోలో ఓ భారీ పంజాబ్ విలేజ్ సెట్ ను త్వరలో నిర్మించబోతున్నారని సమాచారం. మూవీ



అత్యధిక భాగం చిత్రీకరణ ఈ విలేజ్ సెట్ లో జరుగుతుందని, ఆ తర్వాత లండన్, బుడాపెస్ట్ లో కొంత షూటింగ్ చేస్తారని అంటున్నారు.

## మహేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్ సినిమాకు పూజ

మహేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్ అంటే అభిమానులే కాదు, ప్రేక్షకులు కూడా ఎదురుచూస్తూ ఉంటారు. వీరిద్దరి కాంబోలో వచ్చిన 'అతడు' ఎంతపెద్ద హిట్ సొంతం చేసుకుందో తెలిసిందే. తర్వాత వచ్చిన 'ఖలేజా' కూడా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ రెండు సినిమాల తర్వాత వీరి కాంబినేషన్‌లో ముచ్చటగా మూడోసారి మూవీ రానుందంటే ఆడియెన్స్‌లో కచ్చితంగా అంచనాలు భారీగానే ఉంటాయి. అంతేకాకుండా ఈ సినిమా కోసం అభిమానులు ఈగర్?గా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా వస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి తప్ప సెట్స్‌పైకి వెళ్లింది మాత్రం లేదు. అయితే ఎట్టకేలకు వీరి కాంబోలో వస్తున్న ఈ సినిమాకు గురువారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. అయితే ఈ పూజాకార్యక్రమాలకు మహేశ్ బాబు హాజరు కాలేదు. మహేశ్ భార్య నమ్రత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సినిమా హారికా అండ్ క్రియేషన్స్‌లో వస్తున్న ఏడో మూవీ కాగా హీరోగా మహేశ్ బాబుకు 28వ సినిమా. ఇదిలా ఉంటే ఈ సినిమా అతడుకు సీక్వెల్‌గా పుకార్లు వినిపిస్తున్నాయి. 2005లో వచ్చిన 'అతడు' సినిమాకు కొనసాగింపుగా తీయాలని తివిక్రమ్ భావిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా ఈ చిత్రానికి 'పార్థు' అని టైటిల్ పెడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరీ ఇందులో నిజమెంతుందో వేచి చూడాలి.



## 7న ఎఫ్-3 చిత్ర లిరికల్ వీడియో విడుదల

అనీల్ రావిపూడి డైరెక్షన్‌లో విక్టరీ వెంకటేష్, వరుణ్ తేజ్ కలిసి నటించిన ఎఫ్ -2 హిట్ అయిన విషయం తెలిసిందే. కామెడీతో వచ్చిన ఈ మూవీకి సీక్వెల్ గా ఎఫ్-3 తెరకెక్కుతుండగా..సినిమాకి సంబంధించిన అప్డేట్ ఒక్కొక్కటి విడుదల చేస్తూ ఆసక్తిని రేపుతుంది సినిమా యూనిట్. ఇప్పటికే రిలీజ్ డేట్ పై క్లారిటీ ఇచ్చిన మేకర్స్..లేటెస్ట్ గా ఎఫ్-3



పాటలను ఒక్కొక్కటి గా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. మొదటి సాంగ్ లోని 'లబ్ డబ్ లబ్ డబ్ డబ్బు' లిరికల్ వీడియోను 7న విడుదల చేస్తున్నట్లు తెలిపిన యూనిట్.. మూవీలోని సరికొత్త పోస్టర్ ను రిలీజ్ చేసింది. విశ్వదాభిరామ..ఎఫ్3 సాంగ్స్ హంగామా, షురూ రా మామా! అంటూ ట్వీట్ చేసిన యూనిట్ ..వెంకటేష్, వరుణ్ పోస్టర్ ను షేర్ చేసింది. దీంతో ఎఫ్ 3 సాంగ్స్ హంగామా షురూ కావడంతో సినిమా కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ 28న రిలీజ్ కానున్న ఈ సినిమాలో తమన్నా, మెహ్రీన్, సునీల్, రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు.. దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నారు.

## కరోనా నుంచి కోలుకున్న మెగాస్టార్

కరోనా నుంచి కోలుకున్నమెగాస్టార్ చిరంజీవి ఆగిపోయిన చిత్రాల షూటింగ్స్‌ను మొదలు పెట్టబోతున్నారు. ప్రస్తుతం ఆయన 'గాడ్‌ఫాదర్ , బోళాశంకర్' చిత్రాలకు డేట్స్ ఇచ్చారు. ఈ నెల 8 నుంచి 'గాడ్‌ఫాదర్' షూటింగ్‌లో చిరు పాల్గొనబోతున్నట్టు వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లోనే జరుగుతోంది. నయనతార, సత్యదేవ్ తదితరులపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 45 శాతం చిత్రీకరణ కంప్లీట్ అయినట్టు దర్శకుడు మోహన్‌రాజా ఆ మధ్య తెలియచేశారు. వారం రోజుల పాటు చిరంజీవి 'గాడ్‌ఫాదర్' షూటింగ్‌లో పాల్గొంటారని సమాచారం. ఆ తర్వాత 'భోళాశంకర్' షూటింగ్ కు షిఫ్ట్ అవుతారు. ముందుగా ఎలాన్ చేసిన షెడ్యూల్ చిరుకి కరోనా సోకడంతో కేన్సిల్ అయింది. ఇప్పుడు ఆయన రాకతో మళ్ళీ మొదలు కాబోతోంది. ఇక 'గాడ్‌ఫాదర్' చిత్రంలో బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ నటిస్తున్న సంగతి తెలిసిందే. చివరి షెడ్యూల్ లో ఆయన జాయిన్ అవుతారట.



## మే 20న గోపీచంద్ సినిమా విడుదలకు ముహూర్తం

స్టార్ హీరోల దగ్గర్నుంచి చిన్న హీరోల వరకు.. అందరి సినిమాలూ రిలీజ్‌కి పోటీ పడుతున్నాయి. ఇప్పుడు గోపీచంద్ కూడా బరిలోకి దిగడానికి రెడీ అయ్యాడు. మారుతి డైరెక్షన్‌లో 'పక్కా కమర్షియల్' మూవీ చేస్తున్నాడు గోపీచంద్. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మే 20న విడుదల చేయనున్నట్లు కన్‌ఫర్మ్ చేశారు. 'మే 20న ప్రపంచవ్యాప్తంగా వస్తున్నాం. కరోనా కరుణిస్తే' అంటూ తనదైన హ్యూమర్ టచ్‌తో రిలీజ్ డేట్‌ని రివీల్ చేశాడు మారుతి. ఆల్రెడీ ప్రమోషన్స్ మొదలు పెట్టారు. సీతారామశాస్త్రి రాసిన టైటిల్ సాంగ్‌ను బుధవారం లాంచ్ చేశారు. ఈ పాటను కంపోజ్ చేయడంతో పాటు హేమచంద్రతో కలిసి జోష్‌ఫుల్‌గా పాడాడు జేక్స్ బిజోయ్. ఇదో కోర్ట్ రూమ్ డ్రామా. గోపీచంద్‌తో పాటు హీరోయిన్ రాశీఖన్నా కూడా లాయర్‌గా కనిపించబోతోంది. రావు రమేష్, సప్తగిరి తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com